Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 153 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

బుధవారం, 24 - 12 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## మధ్యప్రదేశ్‌ను మొత్తం భారతదేశం, ప్రపంచంలోనే అత్యుత్తమ పర్యాటక గమ్యస్థానంగా హైలైట్ చేయడం మా ప్రాధాన్యత





**భోపాల్ :** ఇన్క్రెడిబుల్ ఇండియా నడిబొడ్డున ఉన్న మన మధ్యప్రదేశ్ పర్యాటకానికి అపారమైన అవకాశాలు ఉన్న రాష్ట్రం. గత సంవత్సరం మధ్యప్రదేశ్ భూభాగానికి 14 కోట్లకు పైగా పర్యాటకులు వచ్చారు. ఈ విభాగం పర్యాటక రంగంలో చేసిన అద్భుతమైన కృషికి గత 2 సంవత్సరాలలో 18 కి పైగా అవార్డులు మరియు గౌరవాలతో సత్కరించబడింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, 900 కోట్ల రూపాయలకు పైగా వ్యయంతో 20 సాంస్కృతిక మరియు మతపరమైన ప్రదేశాలు నిర్మించబడుతున్నాయి. అభివృద్ధి చెందిన భారతదేశం అనే భావనకు అనుగుణంగా, 'అభివృద్ధి చెందిన మధ్యప్రదేశ్' కలను సాకారం చేయాలని మా ప్రభుత్వం నిశ్చయించుకుంది. ప్రపంచ వేదికపై 10 యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాలను మరియు భోపాల్, ఇండోర్ మరియు మహేశ్వర్లను 'క్రియేటివ్ సిటీస్' గా అభివృద్ధి చేయడమే మా ప్రభుత్వ ప్రాధాన్యత. రాష్ట్ర జిడిపిలో పర్యాటక సహకారాన్ని 10 శాతానికి పెంచడమే మా లక్ష్యం. పర్యాటకం, సంస్కృతి మరియు మతపరమైన ఎండోమెంట్స్ సహాయ మంత్రి (స్వతంత్ర ఛార్జ్) మరియు మత వ్యవహారాల సహాయ మంత్రి (స్వతంత్ర ఛార్జ్) శ్రీ ధర్మేంద్ర భావ్ సింగ్ లోధి రెండు సంవత్సరాల అభివృద్ధి మరియు సేవకు గుర్తుగా విలేకరుల సమావేశం నిర్వహించారు.

**భోపాల్ :**
ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం సాంస్కృతిక పునరుజ్జీవనాన్ని చూస్తోందని పర్యాటకం, సంస్కృతి మరియు మతపరమైన ట్రస్టులు మరియు మత వ్యవహారాల సహాయ మంత్రి (స్వతంత్ర ఛార్జ్) ధర్మేంద్ర భావ్ సింగ్ లోధి అన్నారు. డాక్టర్ మోహన్ యాదవ్ నాయకత్వంలో, మా ప్రభుత్వం రాష్ట్ర సాంస్కృతిక అభ్యున్నతికి కట్టుబడి ఉంది. పర్యాటక దృక్పథం నుండి చూస్తే, మధ్యప్రదేశ్ను మొత్తం భారతదేశంలో మరియు ప్రపంచ వేదికపై ఉత్తమ పర్యాటక గమ్యస్థానంగా హైలైట్ చేయడం మా ప్రాధాన్యత. రాబోయే కాలంలో మీరు పర్యాటకం మరియు సంస్కృతి రంగంలో అనేక ప్రత్యేకమైన పనులను ఖచ్చితంగా చూస్తారు.
గత రెండేళ్లలో, గ్రామీణ పర్యాటకాన్ని ప్రోత్స హించడానికి 400 కి పైగా హోమ్స్టేలు నిర్మించబడ్డాయి మరియు ప్రారంభించబడ్డాయి. దీనితో గ్రామీణ కుటుంబాలకు 7 కోట్ల రూపాయలకు పైగా వ్యాపారం లభించింది. 1, 000 హోమ్స్టేలు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పర్యాటక రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించడానికి రీజినల్ టూరిజం కాన్క్లేవ్ మరియు మధ్యప్రదేశ్ ట్రావెల్ మార్ట్ వంటి ప్రధాన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాల ద్వారా సుమారు 10 వేల కోట్ల రూపాయల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయి. రెండు సంవత్సరాల అభివృద్ధి మరియు సేవలపై దృష్టి సారించి మంగళవారం భోపాల్లోని కుశాబౌ ఠాక్రే అంతర్జాతీయ ఆడిటోరియంలో విలేకరుల సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి లోధి ప్రసంగించారు. మధ్యప్రదేశ్ పర్యాటక బోర్డు అదనపు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అభయ్ అరవింద్ బెడేకర్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఎన్.పి.నమ్దేవ్, ఇతర శాఖల అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఏపీలో ఏసీబీ సోదాలు.. ఆ శాఖపై అధికారుల ఫోకస్

**అమరావతి, (రాజధాని వార్తలు):** అవినీతిపై ఉక్కుపాదం మోపేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే ఏసీబీ (యాంటీ కరప్షన్ బ్యూరో) అధికారులు మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ప్రధానంగా రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన అధికారులపై అక్రమ సంపాదన ఆరోపణలు రావడంతో ఏసీబీ రంగంలోకి దిగింది. ముఖ్యంగా విజయనగరం, విశాఖపట్నం, ఎన్టీఆర్, సత్యసాయి జిల్లాల్లో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేయడం చర్చనీయాంశంగా మారింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సంబంధించిన అధికారులు, ఉద్యోగులు, ప్రైవేట్ వ్యక్తుల నివాసాల్లో ఈ సోదాలు కొనసాగాయి. సోదాల సమయంలో కీలక ఫైళ్లు, కంప్యూటర్ డేటా, లావాదేవీలకు సంబంధించిన రికార్డులను ఏసీబీ అధికారులు పరిశీలించినట్లు సమాచారం. విజయనగరం జిల్లా భోగాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చెందిన రామకృష్ణతో పాటు సహ ఉద్యోగులు, మరో ప్రైవేట్ ఉద్యోగి నివాసాల్లో ఏసీబీ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. విశాఖలోని నాలుగు ప్రాంతాల్లో సోదాలు కొనసాగాయి. పెందుర్తి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో ఉద్యోగుల ఇళ్లలో.. ఎన్టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నం సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్‌లో తనిఖీలు చేశారు ఏసీబీ అధికారులు. సత్యసాయి జిల్లాలోని చిలమత్తూరులో తనిఖీలు నిర్వహించారు. భూముల రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ, డాక్యుమెంట్ల నమోదు విషయంలో అక్రమ లావా దేవీలు జరిగినట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఏసీబీ రైడ్స్ జరిగినట్లు తెలుస్తోంది.

## టీడీపీ మాజీ ఎంపీకి కేంద్రంలో కీలక పదవి



**ఢిల్లీ :** తెలుగుదేశం పార్టీ మాజీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్‌కు కేంద్ర ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించింది. సుప్రీంకోర్టులో భారత ప్రభుత్వాన్ని ప్రాతినిధ్యం వహించే అదనపు సొలిసిటర్ జనరల్‌గా ఆయనను మోదీ సర్కార్ నియమించింది. ఈ పదవిలో ఆయన మూడేళ్ల పాటు కొనసాగనున్నట్లు కేంద్ర ప్రభుత్వం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ పదవికి దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మ కమైన న్యాయపదవుల్లో ఒకటిగా గుర్తింపు ఉంది. కనకమేడల రవీంద్ర కుమార్ నియామకం న్యాయరంగంలో ఆయనకు ఉన్న అనుభవానికి, సామర్థ్యానికి గుర్తింపుగా రాజకీయ, న్యాయ వర్గాలు భావిస్తున్నాయి. రాజకీయ జీవితంతో పాటు న్యాయరంగంలోనూ చురుకైన పాత్ర పోషించిన ఆయనకు ఇప్పుడు దేశస్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించడం ప్రత్యేకంగా నిలుస్తోంది. కేంద్ర ప్రభుత్వ విధానాలకు సంబంధించిన న్యాయ అంశాలపై కనకమేడల రవీంద్ర కుమార్ కీలక పాత్ర పోషించనున్నారు. రాజ్యాంగపరమైన కీలక వివాదాల్లో ప్రభుత్వ వాదనను ఆయన బలంగా వినిపిస్తారని కేంద్రం భావిస్తోంది. కనకమేడల రవీంద్ర కుమార్‌కు ఈ పదవి వరించడంతో తెలుగుదేశం పార్టీ వర్గాల్లో ఆనందం వెల్లివిరిసింది. పార్టీ నేతలు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అనుభవ జ్ఞుడైన న్యాయవాదికి ఈ పదవి రావడం సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వ వాదనకు బలం చేకూరుస్తోందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కనకమేడల రవీంద్ర కుమార్‌ను అదనపు సొలిసిటర్ జనరల్‌గా కేంద్ర ప్రభుత్వం నియమించడం తెలుగు రాష్ట్రాలకు గర్వకారణంగా నిలుస్తోందని టీడీపీ నేతలు ప్రశంసిస్తు న్నారు. మూడేళ్ల పాటు సుప్రీంకోర్టులో భారత ప్రభుత్వ తరఫున సేవలందించనున్న ఆయనకు ఈ పదవి న్యాయరంగంలో ఉన్న ప్రతిభకు లభించిన గొప్ప గుర్తింపుగా భావిస్తున్నారు. కనకమేడల రవీంద్ర కుమార్ నియామకంతో రాజకీయ, న్యాయవర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

## యువతలో నైపుణ్యం పెంచేలా క్వాంటం టెక్నాలజీ కోర్సులు

### - పాఠశాలల్లో దశలవారీగా కంప్యూటర్ ల్యాబ్స్ - ఐఐటీ మద్రాస్ ప్రతినిధులతో సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఏపీలోని యువతకు నూతన నైపుణ్యాల కోసం త్వరలో క్వాంటం టెక్నాలజీ కోర్సులను కూడా అందించనున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ మేరకు టెక్ విద్యార్థులు క్వాంటం, ఏఐ రంగాల్లో అవకాశాలు అందిపుచ్చుకునేలా వారికి శిక్షణ ఇప్పించడంతో పాటు పాఠశాల స్థాయి నుంచే క్వాంటం టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఐఐటీ మద్రాస్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో డిజిటల్ పద్ధతుల ద్వారా విద్యార్థులకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన కల్పించేలా రూపొందించిన ప్రతిపాదనలను ఐఐటీ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. వచ్చే ఏడాది నుంచి రెండేళ్ల పాటు నాలుగు విడతల్లో విద్యార్థులకు ఏఐపై అవగాహన కల్పించేలా తయారు చేసిన యాక్షన్ ప్లాన్‌ను ఐఐటీ మద్రాస్ ప్రతినిధులు ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలను సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "ఏపీలోని ప్రతి విద్యార్థికి క్వాంటం టెక్నాలజీపై అవగాహన ఉండాలి. రాష్ట్రాన్ని నాలెడ్జి హబ్‌గా తీర్చిదిద్దుతున్న క్రమంలో ఇక్కడి అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దాలి. ప్రైవేట్ విద్యార్థులతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకూ క్వాంటం టెక్నాలజీ పట్ల అవగాహన ఉండాలి. 7, 8, 9 తరగతుల చదివే విద్యార్థులకు క్వాంటంపై అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలి. ఇందుకోసం పాఠశాలల్లో దశలవారీగా కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయండి. దీని కోసం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలి. 2026 జనవరి నెలాఖరులో స్టూడెంట్స్ పార్టనర్ షిప్ సమ్మిట్ నిర్వహిస్తాం. ఆ సమ్మిట్‌లో విద్యార్థులు తమ ఇన్నోవేషన్స్ ప్రదర్శించేలా ఏర్పాట్లు చేద్దాం. పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే ఆలోచన కలిగించేందుకు ఇలాంటి సదస్సులు విద్యార్థులకు ఉపకరిస్తాయి. అలాగే క్వాంటంలో స్కిల్స్ అప్‌గ్రేడ్ చేసుకోవడం కోసం కేంద్రం చేపడుతున్న నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్ హ్యాన్స్‌డ్ లెర్నింగ్ వేదికను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉంది. 50 వేల మందికి పైగా టెక్ విద్యార్థులకు క్వాంటం నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. 2026 జనవరి నెలాఖరులోగా క్వాంటం టెక్నాలజిలో నైపుణ్యాలు కల్పించేలా పాఠ్యాంశాల రూపకల్పన జరగాలి. వివిధ ఐఐటీలు క్వాంటం విషయంలో చేస్తోన్న అధ్యయనాలను కూడా పరిశీలించాలి." అని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే ఈ సమావేశంలో ట్రూ 5జీ సేవల విస్తరణపై బీఎస్ఎన్ఎల్ అధికారులతో సీఎం సమీక్షించారు. ఈ సమావేశంలో విద్యాశాఖకు చెందిన ఉన్నతాధికారులతో పాటు ఐఐటీ మద్రాస్, ఐఐటీ తిరుపతి, ఐబీఎం సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

## పీపీపీ విధానం లక్ష్యం అదే : మంత్రి సత్యకుమార్

**విజయవాడ, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల బాలికల నూతన వసతి గృహ నిర్మాణ భవనాన్ని మంత్రి సత్య కుమార్ యాదవ్, ఎంపీ కేశినేని శివనాథ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైద్య కళాశాలలో బాలికల వసతిగృహం నిర్మాణానికి జగన్ రూ. 5 కోట్లు కూడా ఇవ్వలేదని.. నిధులు ఇవ్వని వ్యక్తికి పీపీపీ కళాశాలల గురించి మాట్లాడే అర్హత లేదని వ్యాఖ్యానించారు. ఈ కళాశాల వసతి గృహం భవనం నిర్మాణం పూర్తి చేయడంలో జగన్ చేతులెత్తేశారని విమర్శించారు. విద్యార్థులకు ఉన్నత వైద్య విద్య, ఉత్తమ చికిత్సే లక్ష్యంగా పీపీపీ విధానాన్ని ప్రభుత్వ అమలు చేస్తోందన్నారు. 80 శాతం పూర్తైన భవన నిర్మాణాన్ని వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడం దారుణమని మండిపడ్డారు. త్వరలో మొత్తం 5 ఫ్లోర్లను విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామని అన్నారు. సిద్ధార్థ నర్సింగ్ కళాశాల విద్యార్థుల వసతి సమస్యను పరిష్కరిస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

**అందుకే పీపీపీ మోడల్ తెచ్చాం: ఎంపీ**

మెడికల్ కాలేజీ హాస్టల్‌కు 2017లోనే రూ.21 కోట్లు నిధులు మంజూరు చేశారని.. గత ప్రభుత్వం నిధులు నిలిపివేయటంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయని ఎంపీ కేశినేని శివనాథ్ మండిపడ్డారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాగానే మిగిలిన నిధులు మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. హాస్పిటల్‌కు



కావలసిన నిధులను చంద్రబాబు, మంత్రి సత్య కుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. నిర్మాణాలకు అవసరమైన నిధులను మంజూరు అయ్యేలా చూస్తామని చెప్పారు. క్యాన్సర్ చికిత్సకు పూర్తి సౌకర్యాలతో ప్రత్యేక ఆసుపత్రి అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. మారుమూల ప్రాంతాల్లోనూ కార్పొరేట్ వైద్యం అందేలా పీపీపీ మోడల్ తెచ్చామని ఎంపీ కేశినేని శివనాథ్ వివరించారు. కాగా.. ఎంబీబీఎస్ విద్యార్థినులు, సీనియర్ రెసిడెంట్ మహిళా డాక్టర్స్ కోసం నూతన వసతి గృహ నిర్మాణ భవనాన్ని నిర్మించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, గద్దె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మీ శా, అడిషనల్ డి.ఎమ్. ఈ వెంకటేష్, సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

## మావోయిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్.. అంతలోనే



**భువనేశ్వర్ :** లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం కల్పించడమే కాకుండా.. ప్రభుత్వం తరఫున అందిస్తున్న ఆర్థిక సాయాన్ని మరింత పెంచుతామంటూ ఒడిశా ప్రభుత్వం చేసిన ప్రకటన సత్ఫలితాలను ఇస్తుంది. ఈ ప్రకటన చేసిన కొన్ని గంటలకే ప్రభుత్వం ఎదుట 22 మంది మావోయిస్టులు లొంగిపోయారు. మంగళవా రం మల్కాన్‌గిరి జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. వీరిందరిపై రూ1.89 కోట్ల రివార్డు ఉందని పోలీసులు తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టుల వివరాలను డీజీపీ వైబి.ఖురానియా వెల్లడిస్తారని పేర్కొన్నారు. ఇంత మంది లొంగిపోవడం.. ఈ ఏడాదిలో ఇదే తొలిసారని వివరించారు. కలహండి, కంధమాల్, బలంగీర్, మల్కాన్‌గిరి, కోరాపుట్, నబరంగ్‌పూర్, నౌపడా, రాయగడ, బౌధ్ జిల్లాల్లో మావోయిస్టుల ప్రభావం అత్యధికంగా ఉంది. అయితే ఒడిశాలోని కోరాపుట్, మల్కాన్‌గిరి, కలహండి, నబరంగ్‌పూర్, నౌపడా, బలంగీర్ జిల్లాలు.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి సరిహద్దుగా ఉన్నాయి. ఈ ఆరు జిల్లాల్లో మావోయిస్టుల ప్రాభవం అధికంగా ఉంది. ఇక ఈ రోజు లొంగిపోయిన మావోయిస్టులంతా ఏసీఎం, డీసీఎంలే ఉన్నారని వివరించారు. వీరిపై రూ. 5.5 లక్షల నుంచి రూ. 27.5 లక్షల వరకు రివార్డు ఉందన్నారు. రాష్ట్రంలో మావోయిస్టులు లొంగిపోతే.. పొరుగునున్న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అందిస్తున్న రివార్డు కంటే 10 శాతం అధికంగా నగదు అందిస్తామని ఒడిశాలోని మోహన్ దాస్ మాంఝీ ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. ఈ ప్రకటన చేసిన మరునాడే 22 మంది మావోయిస్టులు లొంగిపోయారు. రానున్న రోజుల్లో మరింత మంది మావోయిస్టులు ప్రభుత్వం ఎదుట లొంగిపోయే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వం భావిస్తోంది. 2026, మార్చి నెలాఖరు నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలతోపాటు పోలీసులు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహించారు.. నిర్వహిస్తు న్నారు. దాంతో వరుస ఎన్‌కౌంటర్లు చోటు చేసుకుని.. వందలాది మంది మావోయిస్టులు మరణించారు. భారీగా మావోయిస్టులను అరెస్ట్ చేశారు. ఇక వేలాది మంది మావోయిస్టులు.. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ ప్రభుత్వాల ఎదుట లొంగిపోయారు. తాజాగా ఒడిశా రాష్ట్రంలో సైతం భారీగా మావోయిస్టులు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. అదీకాక లొంగిపోయి ప్రభుత్వం అందించే రివార్డు తీసుకుని జన జీవన స్రవంతిలో కలవడం ద్వారా దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని మావోయిస్టులు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే.

# ఏరీస్ కంపెనీ ఆధ్వర్యంలో ఎనాలసిస్ నందు ఇంటర్న్‌షిప్ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని డికెడబ్ల్యూ కాలేజీ నందు సోమవారం ఏరీస్ కంపెనీ ఆధ్వర్యంలో సాయిల్ ఎనాలసిస్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఏరీస్ కంపెనీ ప్రతినిధి అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మార్కెటింగ్ జయప్రదీప్ సుబ్రమణియన్ మాట్లాడుతూ భూసార పరీక్షలు ఆవశ్యకత గురించి ముఖ్యంగా సాయి ఎనాలసిస్ అనేది ప్రతి ఒక్క రైతుకి చాలా ముఖ్యమైనటువంటిది భూమి ఆరోగ్యంగా ఉన్నప్పుడే రైతు పండించే పంట ఆరోగ్యంగా ఉంటుంది పిహెచ్ ఆర్గానిక్ కార్బన్ పోషకాలు యొక్క స్థాయిని తెలుసుకోవడం వలన రైతులు దానికి అనుగుణంగా వ్యవసాయంలో సరైనటువంటి దిగుబడిని విద్యార్థులకు అందరికీ కూడా సాయిల్ టెస్ట్ పైన అవగాహన కల్పిస్తూ ఎరీస్ కంపెనీ ముందు కెళుతుందని కావున ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రానున్న కాలంలో ఇంకా అధిక దిగుబడులు పొందే విధంగా ప్రతి ఒక్కరూ వ్యవసాయ రంగంలో ఉపయోగపడాలని తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు సాయిల్ ఎనాలసిస్ నందు ఇంటర్న్‌షిప్ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డికెడబ్ల్యూ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గిరి. కెమిస్ట్రీ హెచ్ఓడి మోహన్ రెడ్డి. ఎరిస్ కంపెనీ ప్రతినిధులు రత్తయ్య. ఎన్.వేణుమాధవ్. రాధిక, సుందర రాజు, సర్వేశ్వరరావు ఏజడ్ఎం తదితరులు పాల్గొన్నారు.

# చట్ట ప్రకారం విచారణ జరిపి న్యాయం చేస్తాం : యస్.పి. అజిత వేజెండ్ల







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లా పోలీసు కార్యాలయం నందు నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంలో 143 ఫిర్యాదులు స్వీకరణ. వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫిర్యాదుదారులను మాట్లాడించి, వారికి తక్షణమే ఉపశమనం కలిగించే విధంగా తగిన చర్యలు తీసుకున్న జిల్లా యస్.పి.. ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం ఉండరాదు.. ప్రజలతో జవాబుదారీగా వ్యవహరించి పిటీషన్లను పరిష్కరించాలని ఆదేశాలు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, చట్టపరిధిలో పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా యస్.పి.. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో జిల్లా యస్.పి. స్వయంగా మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 143 ఫిర్యాదులు వచ్చాయి.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని.. 1. సంగం పరిధికి చెందినటువంటి మహిళను, గుర్తు తెలియని వ్యక్తి ఇంస్టాగ్రామ్ ద్వారా తన యొక్క వ్యక్తిగత ఫోటోలను మార్ఫింగ్ చేసి అసభ్యకరంగా పంపించి వేధిస్తున్నాడని, పలు రకాల అకౌంట్లో నుంచి తనకూ, తనతో పాటు తన సన్నిహితులకు కూడా తన యొక్క వ్యక్తిగత అసభ్యకర ఫోటోలు, వీడియోలు పంపిస్తున్నాడని, మానసికంగా వేధిస్తున్నారని విచారించి న్యాయం చేయాలని కోరారు. 2. చేజర్ల పరిధికి చెందినటువంటి మహిళను, అదే మండలానికి చెందిన రిషి అనే వ్యక్తి ఫోన్‌లో పరిచయమై సన్నిహితంగా ఉండి, వ్యక్తిగత ఫోటోలు తీసుకొని, తన కోరికలు తీర్చాలని, లేదంటే సోషల్ మీడియాలో పెడతానని బెదిరిస్తున్నాడని, విచారించి న్యాయం చేయాలని కోరారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా యస్.పి., డిఎస్పీ ఆత్మకూరు వేణుగోపాల్, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి, పిసిఆర్ సిఐ భక్తవత్సల రెడ్డి, మహిళా స్టేషన్ సిఐ సుబ్బారావు, ఎస్‌బి సిఐ-1 వెంకటేశ్వరరావు, ఎస్‌బి సిఐ-2 శ్రీనివాస రెడ్డి మరియు కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కరెంటోళ్ల జనబాట పోస్టర్లు, యాప్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

## - వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారానికి ఏపీఎస్‌పీడీసీఎల్ వినూత్న కార్యక్రమం - పాల్గొన్న జాయింట్ కలెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో జిల్లా కలెక్టర్ మరియు డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ గౌరవనీయులు హిమాన్షు శుక్ల, ఐఏఎస్ ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన "కరెంటోళ్ళ జనబాట" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు మరియు యాప్‌ను అధికారికంగా ఆవిష్కరించారు.

**గ్రామాలు, పట్టణాల్లో క్షేత్రస్థాయి పరిశీలనలు**

వినియోగదారుల సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి పరిష్కరించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని అమలులోకి తీసుకు వచ్చారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది నేరుగా గ్రామాలు, పట్టణ వార్డుల్లో పర్యటించి వినియోగదారులతో మమేకమవుతారు.

**ప్రతి మంగళవారం, శుక్రవారం జనబాట కార్యక్రమం**

ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి మంగళవారం మరియు శుక్రవారం క్రింది స్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు నిర్దేశిత గ్రామాల్లో పర్యటనలు నిర్వహిస్తారు.

**11 కేవీ, ఎల్‌టీ, వ్యవసాయ లైన్ల సమగ్ర తనిఖీ**

11 కేవీ, ఎల్‌టీ, వ్యవసాయ విద్యుత్ లైన్లను పరిశీలించి చెట్ల కొమ్మల తొలగింపు, శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాల మార్పు, వేలాడుతున్న తీగల సరిచేత వంటి భద్రతా చర్యలు చేపడతారు.

**నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యం**

క్షేత్రస్థాయిలో సమస్యల గుర్తింపు ద్వారా వినియోగదారులకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడంతో పాటు విద్యుత్ నష్టాలను అరికట్టడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని అధికారులు తెలిపారు.

**విద్యుత్ భద్రత దృష్ట్యా వాలిపోయే స్థితిలో ఉన్న విద్యుత్ స్తంభాలు గుర్తింపు మరియు మార్పు చేయడం**

క్రిందకు వేలాడుతున్న తీగలు, వాలిపోయిన స్తంభాలు, ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే గుర్తించి మరమ్మతులు చేయాలని, అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెల ఎత్తులు పెంచాలని లేదా ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం

**పునరుత్పాదక శక్తి, స్మార్ట్ మీటర్లపై అవగాహన**

గ్రూప్ ఆఫ్ సోలార్ ప్లాంట్లకు ప్రోత్సాహం, స్మార్ట్ మీటర్లపై వినియోగదారులకు అవగాహన కల్పించడం మరియు స్మార్ట్ మీటర్లపై ఉన్న అనుమానాలను నివృత్తి చేయడం

**డయల్ యువర్ సీఎండీ, డయల్ యువర్ ఎస్.ఈ. ద్వారా వేగవంతమైన పరిష్కారాలు**

ప్రతి సోమవారం తిరుపతిలో నిర్వహిస్తున్న డయల్ యువర్ సీఎండీ కార్యక్రమం, అలాగే జిల్లాలో ప్రతి సోమవారం ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు నిర్వహించే డయల్ యువర్ ఎస్.ఈ. కార్యక్రమం ద్వారా వినియోగదారుల ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం అందిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రజల సహకారం అవసరం. విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రజలు విద్యుత్ శాఖకు పూర్తి సహకారం అందించాలి. ఈ కార్యక్రమంలో జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కె.రాఘవేంద్రం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు బాల చంద్ర, శ్రీధర్, లక్ష్మీ నారాయణ, పరందామయ్య, బెనర్జీ, భాను నాయక్, డిఈఈ మునీంద్ర మరియు విద్యుత్ శాఖ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# వెంకటాచలం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు జాతీయ స్థాయి ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు : కలెక్టర్ హిమాన్షు శుక్ల

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నేషనల్ హెల్త్ సిస్టమ్స్ రిసోర్స్ సెంటర్ (NHSRC) ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ (NQAS) బాహ్య మూల్యాంకనంలో నెల్లూరు జిల్లాలోని వెంకటాచలం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (CHC) 84.29 శాతం స్కోర్‌తో NQAS నాణ్యత ధ్రువీకరణ పొందినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మూల్యాంకనం ద్వారా NHSRC బృందం ప్రభుత్వాసుపత్రుల్లో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, సదుపాయాలు, మౌలిక వసతులు, పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలు, రోగి సంతృప్తి వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి NQAS గుర్తింపును ప్రకటించినట్టు చెప్పారు. ఈ ప్రత్యేక గుర్తింపును సాధించిన వైద్యారోగ్య శాఖ వైద్యులు, అధికారులను కలెక్టర్ అభినందించారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు జాతీయ స్థాయిలో నాణ్యత ప్రమాణాలను సాధించడం ద్వారా ప్రజారోగ్య వ్యవస్థపై విశ్వాసం మరింత పెరుగుతుందని, రాష్ట్రంలో ఆరోగ్య సేవల బలోపేతానికి ఇది దోహదపడుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్ల పేర్కొన్నారు. ఇదే



స్ఫూర్తితో జిల్లాలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి, వైద్య సేవల్లో రోగులు సంతృప్తి చెందేలా కృషి చేస్తామని ఈ సందరర్భంగా కలెక్టర్ తెలిపారు.

# గీత కులాల పిక్నిక్‌ను భారీగా విజయవంతం చేస్తాం : రాజు గౌడ్ యాత

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఉత్తరాంధ్ర ప్రాంతంలో గీత కులాలు అత్యధిక జనాభా కలిగి ఉన్నాయి. మనం దరం కలిసికట్టుగా గీత సహా కులాలు అందరూ అన్నదమ్ములుగా మన ఐక్యత సత్తా చాటాలని ఆకాంక్షిస్తూ నాలుగో తారీఖున జరగబోయే మన పిక్నిక్‌ని ఘనవిజయం చేసి గీత కులాల సత్తా చాటాలని గీత కులాలన్నీ కలిసికట్టుగా ముందుకు వెళితే రానున్న రోజులలో మనకు రావలసిన రాజకీయ భాగస్వామ్యం ఆర్థిక చైతన్యం అదేవిధంగా ఈ ప్రాంత గీత కులాల ప్రజలందరూ అభివృద్ధి చెందుతారని తెలియజేయడం జరుగుతుంది. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా లేబర్ మినిస్టర్ వాసంశెట్టి సుభాష్ రెవెన్యూ మినిస్టర్ అనగాని సత్యప్రసాద్ మాజీ మంత్రి పితాని సత్యనారాయణ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు గౌడ్ కార్పొరేషన్ చైర్మన్ విశాఖపట్నంలో గల స్థానిక ఎమ్మెల్యేలు



ఎంపీ భరత్ అందరూ పాల్గొని గీత కులాల అభివృద్ధి కొరకు సహాయ సహకారాలు అందిస్తారని తెలియజేయడం జరుగుతుంది.

# సాగర తీరాన వైజాగ్ ఆటో ఎక్స్ పో

## - ప్రారంభించిన విఎంఆర్డిఏ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్, జాయింట్ కమిషనర్ రమేష్ - కొలువుతీరిన అన్ని బ్రాండ్ల కార్లు, బైకులు - రేస్ ఎంటర్టైన్మెంట్స్ ఆధ్వర్యంలో రెండు రోజుల ఎక్స్ పో



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** సాగర తీరాన వైజాగ్ ఆటో ఎక్స్ పో 2025 ఘనంగా ప్రారంభమైంది. వి.ఎం.ఆర్.డి.ఏ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్, జాయింట్ కమిషనర్ రమేష్ సంయుక్తంగా దీన్ని ప్రారంభించారు. రెండు రోజులు పాటు జరిగే ఈ ఈవెంట్‌లో సుమారు 20 బ్రాండ్లు కార్లు, బైకుల కంపెనీలు తమ ఉత్ప త్తులను వాహన కొనుగోలుదారులకు అందుబాటులో ఉంచారు. సంవత్సరాంతపు డిస్కౌంట్ సేల్స్‌లో భాగంగా పలు మోడల్ కార్లు బైకులు అమ్మకాలు జరిపేందుకు సిద్ధంగా ఉంచారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆటోమొబైల్ రంగంపై జీఎస్టీ శాతాన్ని గణనీ యంగా తగ్గించడంతో వాహన కొనుగోలు ప్రియులకు ఊరట లభించింది. ప్రముఖ ఈవెంట్ మేనేజ్మెంట్ సంస్థ రేస్ ఎంటర్టై న్మెంట్స్ సారథ్యంలో గడిచిన 15 సంవత్సరాలుగా జరుగుతున్న ఈ ఆటో ఎక్స్ పో ఈవెంట్లు మూలంగా ఒకే చోట కంపెనీల ఉత్పత్తులను ఉంచడం వాహన కొనుగోలుదారులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ముఖ్య గౌరవ అతిథులు పేర్కొ న్నారు. కార్యక్రమంలో భాగంగా మారుతి కారు విక్టోరియాస్ ను ఆవిష్కరించారు. అలాగే టీవీఎస్ కంపెనీకి చెందిన రెండు మోడల్ మోటారు బైక్లను లాంచింగ్ చేశారు. శని ఆదివారాల్లో బీచ్ రోడ్‌లో విశ్వ ప్రియా ఫంక్షన్ హాల్ ఎదురుగా గల పార్కింగ్ స్థలంలో జరుగుతున్న ఈ ఎక్స్ పోను విశాఖ వాసులు సందర్శించి ఈ ఆఫర్లను సద్వినియోగం చేసుకోవాలని ప్రణవ్ గోపాల్ కోరారు. కార్యక్రమంలో ఈస్ట్ ఏసిపి కే లక్ష్మణమూర్తి, జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కే విజయ మోహన్, హాలిడే వరల్డ్ ప్రతినిధి సిహెచ్ గోపి, ప్రముఖ వ్యాపారవేత్త కూనల కామేష్, రేస్ ఈవెంట్ మేనేజర్ దాడి రవికుమార్, పలు ఆటోమొబైల్ కంపెనీల సీఈవోలు, జిఎంలు, సేల్స్ హెడ్‌లు పాల్గొన్నారు.

# జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా శ్రీనివాస రామానుజన్ చిత్రం... సోమా




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా మనుబోలు మండలం వీరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రముఖ చిత్రకారుడు తెలుగు పండిట్ సోమా పద్మా రత్నం జాతీయ గణిత దినోత్సవం సందరరేగా శ్రీనివాస రామానుజన్ చిత్రాన్ని వినూత్నంగా వేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ 1887 డిసెంబర్ 22– 1920 ఏప్రిల్ 26 బ్రిటిష్ పరిపాలన కాలంలో భారతదేశానికి చెందిన గణిత శాస్త్రవేత్త 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప గణిత మేధావులలో ఒకరు శుద్ధ గణితంలో ఈయనకు శాస్త్రీయమైన శిక్షణ లేకపోయినా గణిత విశ్లేషణ సంఖ్య శాస్త్రం అనంత శ్రేణులు అవిరామ భిన్నాలులాంటి గణిత విభాగాలలో విశేషమైన కృషి చేశాడు అప్పట్లో ఇక పరిష్కారం కావు అనుకున్న సమస్యలకు కూడా ఇతను పరిష్కారం కనుగొన్నాడు ఈయనలోనే గణిత పరిశోధన ప్రవృత్తి ఏకాంతంలోనే ఎక్కువగా అభివృద్ధి చెందింది తన పరిశోధనలతో అప్పట్లో ప్రఖ్యాతి గాంచిన గణిత శాస్త్రవేత్తలకు దగ్గర అవ్వాలని కనుగొన్న సూత్రాలు అపూర్వమైనవి అప్పటిదాకా ఎవరు పరిచయం చేయనివి దానికి తోడు వాటిని రామానుజన్ సమర్పించిన విధానం కూడా విభిన్నమైనది అయినా రామానుజన్ తన పట్టు విడవకుండా తన పరిశోధనలను అర్థం చేసుకునే శాస్త్రవేత్తల కోసం వెతుకులాట కొనసాగించాడు 1913లో ఆయన ఇంగ్లాండులోనే కేమ్ బ్రిడ్జి విశ్వవిద్యాలయంలో పనిచేసే జి హెచ్ హార్డి రామానుజాన్ని కేం బ్రిడ్జికి ఆహ్వానించాడు రామానుజన్ ప్రతిపాదించిన చాలా కీలకమైన సిద్ధాంతాలన్నీ కొన్ని అయితే తాను కనివిని ఎరుగనివి కూడా ఆయన అభిప్రాయపడ్డాడు అని తెలియజేశారు. ఇట్లు మీ సోమా పద్మ రత్నం

# విక్రమ సింహపురి వర్సిటీ పరిశోధక విద్యార్థి మోహన్ రెడ్డికి 'డాక్టరేట్'



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధక విద్యార్థి అత్తిపల్లి. మోహన్ రెడ్డి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. సోమవారం విశ్వవిద్యాలయ పరిపాలనా భవనంలో జరిగిన కార్యక్రమంలో వర్సిటీ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆయన ఈ పట్టాను స్వీకరించారు. పరిశోధన ముఖ్యాంశాలు: పర్యవేక్షణ: బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగ అధ్యాపకులు డాక్టర్ పి. చెంచురెడ్డి పర్యవేక్షణలో మోహన్ రెడ్డి తన పరిశోధనను పూర్తి చేశారు.

అంశం: "Floating Solar Photovoltaic Power Generation - A Feasibility Study With Reference to SPS Nellore District, Andhra Pradesh" (శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో నీటిపై తేలియాడే సోలార్ విద్యుత్ ఉత్పత్తి సాధ్యాసాధ్యాలు – ఒక అధ్యయనం) అనే అంశంపై ఆయన తన పరిశోధనా గ్రంథాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా విసి అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా పునరుత్పాదక ఇంధన వనరులపై ఇటువంటి పరిశోధనలు చేయడం అభినందనీయమని కొనియాడారు. అలాగే, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి. హెచ్. విజయ, విభాగ అధిపతి డా.జి.సాయి శ్రవంతి ఆచార్య సుజా ఎస్ నాయర్, డాక్టర్ జె విజేత కూడా ఆయనను అభినందించారు. మరియు తోటి పరిశోధన విద్యార్థులు మోహన్ రెడ్డికు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

# శ్రీనివాస రామానుజన్ గణిత మేధావి జయంతి వేడుకలు






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా మనుబోలు మండలం వీరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం శ్రీనివాస రామానుజన్ గణిత మేధావి గణిత పితామహులు జయంతి సందర్భంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీకాంతరావు అధ్యక్షతన ప్రారంభమైంది మ్యాథమెటిక్స్ స్కూల్ అసిస్టెంట్ శైలజ శ్రీనివాస రామానుజన్ గురించి వారు గణిత సమీకరణాలు లెక్కలకు సంబంధించి ఎన్నో సమస్యలకు పరిష్కారాలు చేసిన గొప్పవారు విద్యార్థినీ విద్యార్థులకు ఈ సందర్భంలో ప్యాడ్లు బాక్సులు పెన్నులు పెన్సిల్లు మొదలైన బహుమతులను అందజేశారు.

అనంతరం పిల్లలందరికీ స్వీట్ అండ్ మిక్చర్ ప్యాకెట్లను అందజేశారు ఈ సభలో ప్రభావతి సోమ పద్మా రత్నం మృదుల సరస్వతి ఉపా ధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేశారు.

# గోమతి నారాయణలో ఘనంగా గణిత దినోత్సవం




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నేషనల్ మ్యాథమెటిక్స్ డే సందర్భంగా నారాయణ గోమతి CBSE స్కూల్, గోమతి నగర్‌లో గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏజిఎం రవివర్మ, ఆర్ఐ ఆడిసేశయ్య, ప్రిన్సిపాల్ సుధీర్, గణిత విభాగ ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల అసెంబ్లీ సమావేశంలో రామానుజన్ గణిత శాస్త్రానికి చేసిన అపూర్వ సేవలను స్మరించుకుంటూ ప్రసంగాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత శాస్త్రం ప్రాధాన్యత, దాని ప్రయోజనాలు, విద్యార్థుల భవిష్యత్తులో గణిత పాత్రపై అవగాహన కల్పించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో గణితంపై ఆసక్తి పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని వక్తలు పేర్కొన్నారు.



# జర్నలిస్ట్ జీవన్ కుమారుడు రూపేష్‌కు గంట్ల పరామర్శ

## - అండగా ఉంటానని భరోసా ఆర్థిక సహాయం

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** జర్నలిస్టు సనపల జీవన్ కుమార్ కుమారుడు రూపేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రస్తుతం కేజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో వైద్య చికిత్స పొందుతున్నారు. సోమవారం తెల్లవారుజామున వైద్యులు ఎడమ కాలికి సర్జరీ పూర్తి చేశారు. అవసరమైతే మరికొన్ని ప్రాంతాల్లో చేయాల్సి ఉందని వైద్యులు చెప్పారు. సమాచారం తెలుసుకున్న జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు గంట్ల శ్రీనుబాబు సోమవారం కేజీహెచ్ లో ఉన్న రూపేష్‌ను పరామర్శించారు. అలాగే ప్రమాదం జరిగిన తర్వాత కేజీహెచ్ వైద్యులతో మాట్లాడినట్లు కూడా గంట్ల శ్రీను బాబు రూపేష్‌కు చెప్పారు. ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని ధైర్యంగా ఉండాలని రూపేష్ తల్లిదండ్రులకు శ్రీను బాబు ధైర్యం చెప్పారు. అలాగే కొంత మొత్తం ఆర్థిక సహాయం అందజేశారు. జర్నలిస్టులకు తన పరిధి మేరకు సాయం అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి

## - ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న ప్రతి రూపాయి కూడా ప్రజలకు చేరాలి : కలెక్టర్ హిమాన్షు శుక్ల




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై శాఖల వారీగా కలెక్టర్ సమీక్షించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రామీణ అభివృద్ధి రంగాల్లో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను జిల్లాకు మంజూరు చేస్తుందన్న కలెక్టర్, ఆ నిధులను నూటికి నూరు శాతం వినియోగించుకునేలా అన్ని శాఖల అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న ప్రతి రూపాయి కూడా ప్రజలకు చేరడమే లక్ష్యంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన, ప్రధానమంత్రి మాత ృత్వ వందన యోజన, సమగ్ర శిక్ష, జల్ జీవన్ మిషన్, పీఎం శ్రీ పాఠశాలలు, స్వచ్ఛభారత్ మిషన్, ఐసిడిఎస్ సంక్షేమ పథకాలు, పీఎం కృషి వికాస్ యోజన, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, ఉపాధి హామీ పథకం, రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ యోజన మొదలైన కేంద్ర ప్రభుత్వ సంక్షేమ అభివ ృద్ధి కార్యక్రమాల అమలు తీరుపై కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తూ, జిల్లాలో ఆయా పథకాల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సమావేశంలో డీఎఫ్ఓ మహబూబ్ బాషా, సిపిఓ నరసింహారావు, జడ్పీ సీఈఓ శ్రీధర్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి సత్యవేణి, డీఈఓ బాలాజీ రావు, సమగ్ర శిక్ష పివో వెంకటసుబ్బయ్య, డ్వామా పిడి గంగాభవాని, హౌసింగ్ పీడీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# జివిఎంసి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"లో ౯౯ వినతులు : నగర మేయర్ పీలా శ్రీనివాసరావు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జీవీఎంసీలో అన్ని విభాగాలకు కలిపి 99 వినతులు వచ్చాయని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యా లయం పాత సమావేశ మందిరంలో జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న"ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 99 అర్జీలు/ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా 2వ జోన్‌కు 13, 3వ జోన్‌కు 21, 4వ జోన్‌కు 12, 5వ జోన్‌కు 06, 6వ జోనుకు 10, 8వ జోన్‌కు 11, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 26 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అలాగే జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ & అకౌంట్సు విభాగమునకు 09, రెవెన్యూ విభాగమునకు 12, ప్రజారోగ్య విభాగమునకు 03, పట్టణ ప్రణాళిక విభాగమునకు 42, ఇంజినీరింగు విభాగమునకు 22, మొక్కల విభాగమునకు 01, యుసిడి విభాగమునకు 07 కలిపి మొత్తంగా 99 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అనంతరం కమిషనరు మాట్లాడుతూ ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ఫిర్యాదులను అదే రోజు వెంటనే పరిశీలిస్తూ, సంబంధిత ఫిర్యాదుదారులతో సంప్రదించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ అదే రోజు చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జివిఎంసి అధికారులను, జోనల్ కమీషనర్లను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఇంజనీర్ సత్యనారాయణ రాజు, అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఎస్.ఎస్. వర్మ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి నరేష్ కుమార్, సిసిపి ఏ.ప్రభాకర రావు, డిసిఆర్ ఎస్.శ్రీనివాసరావు, డిడిహెచ్ ఎమ్.దామోదరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి. వాసుదేవ రెడ్డి, స్పోర్ట్స్ డైరెక్టర్ ఇ.ఎ.రాజు, పర్యవేక్షక ఇంజనీర్లు, సిపి, డిసీపీలు, ఏసీపీలు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, రీజనల్ ఫైర్ ఆఫీసర్ కృపావరం, ఎస్టేట్ ఆఫీసర్ పి.సన్యాసినాయుడు, బయాలజిస్ట్, తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## నరేగా నడ్డి విరిగినట్టేనా

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంను రద్దు చేసి, దాని స్థానంలో 'వికసిత్ భారత్-రోజ్‌గార్ & అజీవిక మిషన్ (గ్రామీణ్)'ను తీసుకు రావడంపై దేశవ్యాప్త చర్చ జరుగుతోంది. ఈ మార్పు వల్ల తెలుగు రాష్ట్రాలు ఏమి కోల్పోతాయన్న మూల ప్రశ్నను ఇంకా ఎవరూ తగినంతగా పట్టించుకున్నట్టు లేదు. అసలు విషయానికి వెళ్లే ముందు, నరేగాలోను, కొత్త చట్టంలోను ప్రాథమిక అంశాలను పరిశీలిద్దాం. నరేగా చట్టం 'పని హక్కు' అనే విప్లవాత్మక సూత్రంపై నిర్మితమైంది. దీన్ని అనుసరించి- ఏ గ్రామీణ కుటుంబమైనా పనిని డిమాండ్ చేయగలదు, నిర్ణీత గడువు లోపు పని కల్పించాల్సిన చట్టబద్ధ బాధ్యత ప్రభుత్వంపై ఉంది. పని ఇవ్వకపోతే నిరుద్యోగ భృతి, సకాలంలో వేతన చెల్లింపులు, బాధ్యతలు ఉల్లంఘించినప్పుడు చట్టపరమైన పరిష్కారాలు... ఇవన్నీ నరేగా మూల ఆధారాలు. అయితే, 2005 నుంచి అమల్లో ఉన్న ఈ చట్టాన్ని రద్దు చేసి, కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు 'VB-G RAM G'ని తీసుకు వచ్చింది. ఈ కొత్త చట్టంలోని కీలకాంశాలను పరిశీలిస్తే.. 1) కేంద్రం ఉపాధిని 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచుతామని చెబుతోంది. చట్టంలో 'హామీ' అనే పదం 92 సార్లు ఉన్నా, నరేగా మాదిరి చట్టపరమైన హక్కుగా ఉపాధి లభించే హామీ మాత్రం లేదు. ఉపాధి ప్రాప్తి కార్మికుల డిమాండ్‌పై కాకుండా పరిపాలనా నిర్ణయాలపై ఆధారపడుతుంది. హామీ హక్కుగా లేకపోతే, పని కల్పించడమో నిలిపివేయడమో అధికార యంత్రాంగ విచక్షణపై ఆధారపడే ప్రమాదం పెరుగుతుంది. 2) నరేగా లాగా దేశమంతటా సార్వత్రిక అమలు అనే హామీ ఈ కొత్త చట్టంలో లేదు. కార్యక్రమం ఎక్కడ అమలవుతుందో కేంద్రం నోటిఫై చేస్తుంది. అంటే తెలుగు రాష్ట్రాల్లో ఇది కొన్ని జిల్లాలు/ మండలాలు/ ప్రాంతాలకు పరిమితం అయ్యే అవకాశం ఉంది. 3) ఈ కొత్త చట్టం ప్రకారం క్షేత్రస్థాయిలో డిమాండ్ ఎంత ఉన్నా, కేటాయించిన బడ్జెట్ అయిపోతే అదనపు డిమాండ్‌కు స్పందించాల్సిన బాధ్యత కేంద్రానికి ఉండదు. 4) సాంకేతికత పరిపాలనకు సహాయక సాధనంగా కాకుండా, పని-వేతనాలకు ముందస్తు షరతుగా చట్టంలోనే నిక్షిప్తమవుతుంది. 5) 'వ్యవసాయ పీక్ సీజన్' పేరుతో ఉపాధిని నిలిపివేయడం/తాత్కాలిక విరామం అనే భావనను చట్టం తెస్తోంది (అమలులో ఇది 60 రోజుల విరామంగా మారే అవకాశం ఉందన్న ఆందోళన ఉంది). 6) నిధుల భాగస్వామ్యంలో రాష్ట్రాలపై భారం పెరుగుతుంది. నరేగాలోని 90:10 నిష్పత్తి నుంచి 60:40కి మారడం రాష్ట్ర ప్రభుత్వాలపై ఆర్థిక భారాన్ని గణనీయంగా పెంచుతుంది. ఈ మార్పులన్నీ కలిపి చూస్తే, పనిని హక్కుగా డిమాండ్ చేసే ఉపాధి హామీ వ్యవస్థ ఇక మీదట ఒక పాలనాపరమైన కేటాయింపుల వ్యవస్థగా మారుతుంది. వ్యవసాయంపై ఎక్కువగా ఆధారపడే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలపై దీని ప్రభావం మరింత తీవ్రంగా పడనున్నది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ సుమారు ప్రతి పదిమందిలో ఆరుగురు వ్యవసాయం, దాని అనుబంధ కార్యకలాపాలపై జీవనోపాధి కోసం ఆధారపడుతున్నారు. అందువల్ల గ్రామీణ ఉపాధి హామీ ఈ రాష్ట్రాల్లో ఆర్థికంగా చాలా ముఖ్యమైన వ్యవస్థ. వ్యవసాయ ఆఫ్-సీజన్‌లో వ్యవసాయ కార్మికులే ఉపాధి హామీ కార్మికులుగా మారడం ఇక్కడ సాధారణం. వాతావరణ వైవిధ్యం, యాంత్రీకరణ, అసమాన నీటిపారుదల వంటి కారణాలతో వ్యవసాయ ఉపాధి మరింత అనిశ్చితంగా మారుతోంది. మరోవైపు వ్యవసాయేతర ఉపాధి ఇంకా బలంగా నిలబడలేదు. ఈ పరిస్థితుల్లో నరేగా కేవలం సంక్షేమ పథకం కాదుబీ ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థను స్థిరంగా నిలిపే మూల స్తంభం. 2024-25 లెక్కల ప్రకారం, నరేగా కింద ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే సుమారు 1.1 కోట్ల మంది కార్మికులు నమోదు కాగా, తెలంగాణలో కోటి మందికి పైగా నమోదయ్యారు. ఈ రెండు రాష్ట్రాల్లో మొత్తం పని దినాల్లో 60 శాతం కంటే ఎక్కువ మహిళలవే. ఇంటి బాధ్యతలు చూసుకుంటూనే స్థానికంగా ఆదాయం పొందేందుకు మహిళలకు నరేగా కీలక అవకాశం ఇచ్చింది. అలాగే తెలుగు రాష్ట్రాలలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల జనాభా వాటాతో పోలిస్తే ఉపాధి హామీలో అధిక ప్రాతినిధ్యం కలిగి ఉంది. 2024-25లో రెండు తెలుగు రాష్ట్రాల్లో సుమారు 1.23 లక్షల మంది వికలాంగులు నరేగా ద్వారా ఉపాధి పొందారు. గత ఐదేళ్లలో తెలుగు రాష్ట్రాల్లో వేతనాల రూపంలో సుమారు రూ.41,000 కోట్లు కార్మికులకు చేరాయి. మెటీరియల్ పనులు సుమారు రూ.25,000 కోట్లు విలువైనవిగా కొనసాగాయి. రోడ్లు, సచివాలయ భవనాలు వంటి నిర్మాణాలకు దోహదపడ్డాయి. ఇప్పుడు ప్రభుత్వం వైపు నుంచి హామీ లేని, కేటాయింపు మీద ఆధారపడిన కొత్త చట్టం రావడం వల్ల స్పష్టమైన పరిణామాలు ఉంటాయి: 1) కార్మికుల ఆదాయ నిశ్చయత తగ్గుతుంది. మహిళలకు స్థానికంగా అనువైన ఉపాధి తగ్గుతుందిబీ ఆదివాసీలకు వేసవిలో ప్రధాన జీవనోపాధి బలహీనమవుతుంది, ఎస్సీ/ఎస్టీ కార్మికుల కొనుగోలు శక్తి తగ్గుతుంది, వృద్ధులు, వికలాంగులకు అందుబాటులో ఉన్న పని అవకాశాలు మరింత తగ్గే ప్రమాదం ఉంది. చట్టపరమైన హామీ లేకపోతే, ఉపాధి 'హక్కు' నుంచి ప్రభుత్వం యొక్క 'విచక్షణ'గా మారుతుంది. 2) గ్రామీణ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వాన్ని కోల్పోతుంది. నరేగా వేతనాలు నేరుగా గ్రామీణ మార్కెట్లలోకి ప్రవహించి వినియోగాన్ని నిలబెట్టాయి. కోవిడ్ వంటి షాక్‌ల సమయంలో అవే పెద్ద మద్దతయ్యాయి. ఇదిలేకపోతే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత పెళుసుగా మారుతుంది. 3) రెండు రాష్ట్రాల్లో కలిపి దాదాపు 30,000 మంది సిబ్బంది నరేగాతో అనుసంధానమై ఉన్నారు. కార్మికులకు పనులు/వేతనాలు సక్రమంగా అందేందుకు వీరే సంస్థాగత వెన్నెముక. కొత్త చట్టం వీరి భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చుతుంది.

## విద్యార్థుల కోసం పర్యావరణ దినోత్సవాల క్యాలెండర్

**- ఎస్ శంకర్ నాయక్, జాయింట్ చీఫ్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్, ఏపి కాలుష్య నియంత్రణ మండలి**






**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ప్రతి విద్యార్థి పర్యావరణ హితంగా జీవించేందుకు ఉపకరించే విధంగా పర్యావరణ దినోత్సవ క్యాలెండర్ రూపొందించింది గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో అని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి జాయింట్ చీఫ్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ఎస్ శంకర్ నాయక్ అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం సాయంత్రం మాధవధారలోని ఎపి కాలుష్య నియంత్రణ మండలి కార్యాల యంలో ఎన్విరాన్మెంటల్ క్యాలండర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడిచిన 25 సంవత్సరాలుగా పర్యావరణ దినోత్సవాలు క్యాలెండర్ ముద్రించడం ఆనందదాయకం అన్నారు. ప్రతి విద్యా సంస్థలో ఈ క్యాలెండర్ వినియోగించి పర్యావరణ దినోత్సవాలు నిర్వహించాలన్నారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ రిసోర్స్ సెంటర్ ద్వారా అన్ని విద్యా సంస్థలకు అవసరమైన పర్యావరణ సమాచారం కూడా అందజే స్తుందన్నారు. ఐక్యరాజ్యసమితి, భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభు త్వం ప్రకటించిన అన్ని పర్యావరణ దినోత్సవాలు ఈ క్యాలెం డర్‌లో ఉండటం వల్ల విద్యా సంస్థలకు చాలా బాగా ఉపకరిస్తుంది అని పేర్కొన్నారు.

ఉచితంగా అందజేస్తున్న ఈ క్యాలెండర్ను చాలా విలువైనదిగా గుర్తించి ప్రతి ఒక్కరు పర్యావరణ దినోత్స వాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఇఎన్ వీరేంద్ర, ఎన్.ఎం.రామారావునాయుడు విశాఖపట్నం రీజినల్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ పివి ముకుంద రామారావు, ఇంజనీర్ డాక్టర్ శ్రీనివాస్, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జే వి రత్నం, యాక్షన్ ఎయిడ్ కర్ణాటక ప్రాజెక్ట్స్ ఎన్జిఓ హెచ్ఆర్డి ఐ కృష్ణకుమారి తదితరులు పాల్గొని మాట్లాడారు.

## విద్యార్థులు ఒక రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి : ఎంఇఓ



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** గణిత ప్రాముఖ్యత గుర్తెరిగి ప్రతి ఒక్కరు లెక్కల్లో ప్రావీణ్యత సంపాదించి ఆశించిన రంగంలో ఉన్నతి స్థితిని పొందాలని సామర్లకోట ఎంఈఓ పి.పుల్లయ్య, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయి రామకృష్ణలు పేర్కొన్నారు. స్థానిక పిఎం శ్రీ మున్సిపల్ హైస్కూల్ అయోధ్య రామపురంలో ప్రధానోపాధ్యాయులు తోటకూర సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. రామానుజన్ 138వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన గణిత దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎం ఇఓ పి.పుల్లయ్య, ప్రత్యేక ఆహ్వానితులుగా ఎస్ఎంసి చైర్మన్ అక్కిన చక్రధర్‌లు పాల్గొన్నారు. తొలుత శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాస రామానుజన్ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల గణిత ప్రాజెక్టులు ఎంతగానో అలరించాయి. శకుంతలదేవి వేషధారణ, మ్యాజిక్ స్క్వేర్ డాన్స్, క్విజ్ పోటీలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు మెడల్స్‌ను ప్రశంస పత్రాలును అందచేశారు.

**ఆకట్టుకున్న విద్యార్థుల ప్రాజెక్టులు**

సామర్లకోట ప్రతిభ విద్యానికేతన్ పాఠశాలలో మేథ్స్ డే సందర్భంగా విద్యార్థులచే మేథ్స్, సైన్స్, సోషల్, రోబోటిక్ సబ్జెక్టులకు సంబంధించిన ప్రాజెక్ట్‌లను అట్టహాసంగా ప్రదర్శింపచేశారు. ఈ క్రమంలో కిండర్గార్టెన్ నుండి 9 తరగతులను వివిధ కేటగిరిల వారిగా విభజించి, ప్రతీరోజు ఒక్కొక్క కేటగిరి విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించడం, సైంటిస్ట్‌ల వేషధారణలు ప్రదర్శించడం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని వారి పిల్లలు తయారుచేసిన ప్రాజెక్టులను పరిశీలించి, ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎస్.వి.వి.జి.ప్రకాష్ మాట్లాడుతూ కార్యక్రమ నిర్వహణ ఉద్దేశ్యాన్ని తెలియజేశారు. చివరి రోజున సబ్జెక్టుల వారిగా ఉత్తమ ప్రదర్శనాంశాలకు విజేతలను ప్రకటించారు. ఈ కార్యక్రమాలలో పాఠశాల డైరెక్టర్ సుధారాణి ప్రకాష్, ప్రిన్సిపాల్ టి.సునీత, వైస్-ప్రిన్సిపాల్ పి. శ్రీగౌరి, ఉపాధ్యాయులు ఎస్ ఎం సి చైర్మన్ అక్కిన చక్రధర్, మ్యాథ్స్ టీచర్లు బి ఆర్ ఎస్ శివకుమార్, టిఎస్ పద్మావతి, పి నిర్మల, సయ్యదున్నిసా బేగం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విశాఖ టీవి యూనియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వన సమారాధన

**- కార్యక్రమంలో పాల్గొన్న సుమారు 200 మంది టీవి మెకానిక్ సభ్యులు**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ టివి యూనియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుమారుగా 200 మంది టీవీ మెకానిక్ సభ్యులతో వన సమారాధన ఏర్పాటు చేయడము జరిగినది. ఈ కార్యక్రమం పార్కులో ఏర్పాటు చేయడం జరిగినది దీనికి విశాఖ టీవీ యూనియన్ ప్రెసిడెంట్ రహీం ఆధ్వర్యంలో కార్యవర్గం పిక్నిక్ ఏర్పాటు చేయడం జరిగింది. దీనికి సెక్రెటరీగా దిలీప్ మిగతా కార్యవర్గ సభ్యులు అందరూ కృషి చేసి ఎంతో సక్సెస్ ఫుల్‌గా కార్యక్రమం జరిపించడం అయినది అని తెలియచేసారు. కార్యక్రమంలో భాగంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఎజెండా ఏమిటంటే మనకి ఏదైనా మీటింగ్ పెట్టుకోవడానికి షెల్టర్ గవర్నమెంట్ దగ్గర నుంచి ఏర్పాటు చేసుకొనుట కొరకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది అని యూనియన్ సర్వసభ్య సమావేశానికి ఒక అడ్రస్‌గా ఏదైనా ఏర్పాటు చేసుకోవడానికి గవర్నమెంట్ సహకారం కొరకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని తెలియ చేసారు.

## ధ్యానంతో మానసిక, శారీరక ప్రశాంతత

**- ఘనంగా అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం - శ్రీ మాతాజీ నిర్మల దేవి సహజ యోగ ట్రస్ట్ ఏపీ ఆధ్వర్యంలో అవగాహన**




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ధ్యానం జ్ఞాన శక్తిని పెంపొందించడమే కాకుండా మానసిక ప్రశాంతతకు దోహదం చేస్తుందని శ్రీ మాతాజీ నిర్మల దేవి సహజ యోగ ట్రస్ట్ కన్వీనర్ రామ కృష్ణ అన్నారు. విశాఖ ఆర్ కె బీచ్ వైఎమ్ సిఏ ఎదురుగా ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ ధ్యానంతో ఆత్మ పరిశీలన అంతర్గత ప్రశాంతత చేకూరుస్తుంది అన్నారు. శారీరక ఆరోగ్య విషయంలో రక్త పోటు నియంత్రించడంతోపాటు నాణ్య తతో కూడిన నిద్రకు చక్కగా ఉపయోగపడుతుందన్నారు. హార్మోన్ల క్రియాశీలత అరికట్టి భావోద్వేగాల తరంగాలు మార్పు చేసి ప్రశాంతత విశ్రాంతిని చేకూరుస్తుంది అన్నారు. సహజ యోగ వలన అనేక లాభాలు ఉన్నాయని కుండలి జాగృతి చేయడమం వలన ఎన్నో లాభాలు చేకూరుతాయి అన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ధ్యానాన్ని చేర్చుకోవాలన్నారు. కెప్టెన్ బాబురావు మాట్లాడుతూ సహజ యోగతో ప్రతి ఒక్కరూ మానసిక ప్రశాంతంగా ఉం డవచ్చునన్నారు. ధ్యానం వల్ల ప్రతి ఒక్కరూ ఆరోగ్యమైన జీవనాన్ని గడిపేందుకు అవకాశం ఉందన్నారు. సర్వ మానవాళి మానసిక శారీరక ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ సహజ యోగ అలవర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా బీచ్ వాకర్స్‌కు సహజ యోగ ఉపయోగాలు తెలుపుతూ యోగ ఎలా చేయాలి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## పంచారామంలో ఎస్పీ కుటుంబం ప్రత్యేక పూజలు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పంచారామ క్షేత్రమైన సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వరాలయంలో జిల్లా ఎస్పీ బిందు మాధవ్ కుటుంబం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఎస్పీ బిందు మాధవ్ జన్మదిన సందర్భంగా సోమవారం రాత్రి కుటుంబ సమేతంగా భీమేశ్వరాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారి బళ్ళ నీలకంఠ ఆధ్వర్యంలో ఎస్పి దంపతులకు ఆలయ పండితులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం భీమేశ్వర స్వామి, బాలా త్రిపుర సుందరి అమ్మవార్లను వారు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఎస్పీ కుటుంబానికి ఆలయ నంది మండపంలో ఆలయ పండితులు పండిత ఆశీర్వ చనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ కుటుంబానికి స్వామివారి చిత్రపటాన్ని, ప్రత్యేక ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వెంట పెద్దాపురం డిఎస్పి డి శ్రీహరిరాజు, సీఐలు ఏ కృష్ణ భగవాన్, విజయ శంకర్, పోలీస్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్గర్ అండ్ అజీవక బిల్లును రద్దు చేయాలి



**గూడూరు, (రాజధాని వార్తలు):** ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చి పేదల పొట్ట కొట్టడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమా? అని బి.కె.ఎం.యు జిల్లా ప్రధాన కార్యదర్శి సి.హెచ్ ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని సీపీఐ, బి.కె.ఎం.యు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బి.కె.ఎం.యు జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామీణ పేదల జీవన విధానాన్ని పూర్తిగా మార్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వికసిత్ భారత్-గ్యారెంటీ ఫర్ రోజ్గర్ అండ్ ఆజీవిక మిషన్ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో వేతనాలు నూరుశాతం కేంద్రమే భరించేదని, ఇప్పుడు రాష్ట్రాలపై 40 శాతం భారం వేయ డం వల్ల రాష్ట్రానికి సుమారు రూ.ఐదు వేల కోట్ల నిధులు తగ్గి, పథకం అటకెక్కే ప్రమాదం ఉందన్నారు. సాంకేతికత పేరుతో వేధిం పులు, ఆధార్ అనుసంధానం, ఇకెవైసి వంటి కారణాలతో రాష్ట్రంలో ఇప్పటికే 11 లక్షల మంది కార్మికుల పేర్లను తొలగించడం దారుణ మని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకానికి పేరు యధావిధిగా కొనసాగించాలన్నారు. అనంతరం సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశి కుమార్, ఏ.ఐ.టి.యు.సి నియోజకవర్గ అధ్యక్షులు సి.వి.ఆర్ కుమార్ మాట్లాడుతూ నెట్వర్క్ సమస్య వల్ల వేతనాలు రాక కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే పార్ల మెంట్ సమావేశాల్లో ఈ బిల్లును వ్యతిరేకించాలని ఎంపిలను కోరారు. పేదల బతుకుదెరువును దెబ్బతీసే కేంద్ర ప్రభుత్వ నియం తృత్వ పోకడలపై పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం బి.కె.ఎం.యు నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పేరు మార్పు చేయడం బాధా కరం అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒంటెద్దు పోకడలను విరమించు కోవాలని, అదేవిధంగా పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్, ఏ.ఐ.టి.యు.సి నియోజవర్గ కార్యదర్శి నారాయణ, ఏ. ఐ.వై.ఎఫ్ నాయకులు సునీల్, కన్నా సుబ్రమణ్యం, రఘురామయ్య, యాకోబు, సంపూర్ణమ్మ, నరసింహులు శెట్టి, యశ్వంత్, షణ్ముఖ సుందరం, తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్‌కు విరాళం అందజేసిన కమలా రాజశేఖర్



**భద్రాచలం, (రాజధాని వార్తలు):** ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ డివిజన్ మహాసభ నిర్వహణ కొరకు శ్రీ అండ్ శ్రీమతి కమలా రాజశేఖర్ 5 వేల రూపాయలను ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ భద్రాచలం డివిజన కమిటీ అధ్యక్షుడు మందు వెంకటేశ్వరరావు ప్రధాన కార్యదర్శి కె ఎస్ ఎల్ వి ప్రసాద్ కోశాధికారి డి కృష్ణమూర్తి గౌరవ అధ్యక్షులు చంద్ర సుబ్బయ్య చౌదరికు అందజేశారు. ఇదే సందర్భంలో మహాసభ దిగ్విజయంగా జరిగినందుకు కమల రాజశేఖర్ అభినందించారు. అనంతరం వారికి సంఘం బ్యాగును బహుకరించారు. మమ్ములను ఎప్పుడు ఆదరించే ఈ ఇరువులు దంపతులకు కృతజ్ఞతలను తెలియజేశారు.

# మత్తెక్కించే చూపులతో చంపేస్తోంది



కెరటంతో టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం అయిన రకుల్ ప్రీత్ సింగ్ తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్‌గా నిలిచింది. కెరీర్ ఆరంభంలో చిన్న హీరోలతో, చిన్న సినిమాల్లో నటించిన ఈ అమ్మడు ఆ తర్వాత స్టార్ హీరోలతో, పెద్ద బడ్జెట్ సినిమాల్లో క్షణం తీరిక లేకుండా వరుస సినిమాలు చేసింది. ఒకానొక సమయంలో స్టార్ హీరోల సినిమాలకు సైతం డేట్లు లేవు అని చెప్పేంత బిజీగా రకుల్ ప్రీత్ సింగ్ సినిమాలు చేసింది. అయితే రకుల్ కెరీర్ ను చాలా మంది గాలి బుడగతో పోల్చుతూ ఉంటారు. ఒక్కసారిగా పెరిగిన ఆమె స్టార్‌డం, క్రేజ్ అదే స్థాయిలో తగ్గింది. టాలీవుడ్‌లో మూడు నాలుగు సంవత్సరాలు బిజీగా ఉన్న రకుల్ కి ఆ తర్వాత మినిమం ఆఫర్లు కూడా కనిపించడం లేదు. గత కొన్నాళ్లుగా టాలీవుడ్‌కి రకుల్ ప్రీత్ సింగ్ దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలుగులో ఈమెకు ఆఫర్లు కరువయ్యాయి. కొండపొలం తర్వాత రకుల్ ప్రీత్ సింగ్‌కి తెలుగులో సాలిడ్ పాత్ర దక్కలేదు. ఇక హిట్ దక్కి కూడా చాలా ఏళ్లు అయింది. రకుల్ ప్రీత్ సింగ్ టాలీవుడ్‌లో ఆఫర్లు రాని సమయంలో మెల్లగా బాలీవుడ్‌కి దారి వేసుకుంది. అక్కడ మంచి ఆఫర్లు దక్కించుకుంది. కానీ అదృష్టం కలిసి రాకపోవడంతో సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. ఒకటి రెండు పర్వాలేదు అనిపించుకున్నా ఓవరాల్‌గా ఈ అమ్మడి కెరీర్ ఖతం అయినట్లుగానే అనిపిస్తోంది. అయితే అందం విషయంలో ఇప్పటికీ ఈ అమ్మడు కొత్త హీరోయిన్స్ కి పోటీ అన్నట్లుగా నిలుస్తూ సోషల్ మీడియా ద్వారా తన ఫోటోలను షేర్ చేస్తూ వస్తోంది. తాజాగా ఈ అమ్మడు ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఎప్పటిలాగే తన అందమైన ఫోటోలతో రకుల్ ప్రీత్ సింగ్ వార్తల్లో నిలిచింది. రకుల్ ప్రీత్ సింగ్ అందాల ఆరబోత ఫోటోలు చూసిన ప్రతి సారి ఆమె ఫాలోవర్స్‌లో ఎక్కువ శాతం మంది రకుల్‌కి ఇంకొంత కాలం హీరోయిన్‌గా నటించే అర్హత ఉంది అంటూ కామెంట్స్ చేస్తూ ఉంటారు. తాజాగా ఈ అమ్మడు మత్తెక్కించే చూపులతో మేకప్ మిర్రర్ ముందు నిల్చుని అందంగా ఫోటోలకు ఫోజ్ ఇచ్చింది. కవ్వించే విధంగా ఉన్న ఈ అమ్మడి చూపులకు ప్రతి ఒక్కరూ ఫిదా కావాల్సిందే. ఆకట్టుకునే అందంతో పాటు ఆమె ధరించిన బ్లాక్ కలర్ ఔట్ ఫిట్ ఆమె అందంను మరింతగా పెంచింది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. క్లీ వేజ్ షో చేస్తూ లూజ్ హెయిర్‌తో సింపుల్ మేకోవర్‌తో రకుల్ ప్రీత్ సింగ్ ఇచ్చిన ఈ అందాల ఫోజ్‌లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రకుల్ ప్రీత్ సింగ్ ఇండస్ట్రీలో అడుగు పెట్టి ఇన్నాళ్లు అవుతున్నా ఇప్పటికీ అంతకు మించి అన్నట్లుగానే అందంగా ఉంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇంత అందంగా ఉన్న రకుల్ ప్రీత్ సింగ్‌కి అదృష్టం కలిసి రాకపోవడం వల్లే సినిమా ఇండస్ట్రీలో ఆఫర్లు తగ్గాయి, బాలీవుడ్‌లో ఆఫర్లు వచ్చినా సక్సెస్ రాలేదు అనే అభిప్రాయంను పలువురు వ్యక్తం చేస్తున్నారు. కన్నడ మూవీ గిల్లితో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన రకుల్ ప్రీత్ సింగ్ తెలుగులో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ సినిమాతో మొదటి విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఆ సినిమా తర్వాత వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు.

ఎన్టీఆర్‌తో కలిసి నాన్నకు ప్రేమతో, రామ్ చరణ్‌తో కలిసి బ్రూస్‌లీ, అల్లు అర్జున్‌తో సరైనోడు ఇలా చెప్పుకుంటూ పోతే మూడు ఏళ్లలో దాదాపు టాలీవుడ్ స్టార్ హీరోల అందరితోనూ సినిమాలు చేసింది. దాంతో ఈమెకు టాప్ స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు దక్కింది. ఆ సమయంలో టాలీవుడ్‌లో అత్యధిక పారితోషికం తీసుకుంటున్న హీరోయిన్‌గానూ నిలిచింది. ఇప్పుడు మాత్రం ఆఫర్ల కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి ఉంది. కెరీర్ సాఫీగా సాగని ఈ సమయంలో రకుల్ ప్రీత్ సింగ్ పెళ్లి చేసుకుంది. పెళ్లి తర్వాత కూడా సినిమాల్లో ముందు మాదిరిగా నటించేందుకు రెడీగా ఉంది. ఇలాంటి అందమైన ఫోటోలు షేర్ చేసిన సమయంలో రకుల్ ఖచ్చితంగా తన పూర్వ వైభవంను సంతరించుకుంటుంది అనే విశ్వాసం వ్యక్తం అవుతోంది.

# కెరీర్ చరమాంకంలో ఇస్మార్ట్ బ్యూటీ!



నభా నటేష్ టాలీవుడ్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. నన్ను దోచుకుందువటే చిత్రంతో తెలుగు పరిశ్రమకి ఎంట్రీ ఇచ్చిన అమ్మడు ఇస్మార్ట్ శంకర్ సినిమాతో వెలుగులోకి వచ్చింది. పూరి మేకింగ్‌లో అమ్మడు ప్రత్యకంగా హైలైట్ అయింది. నటిగా నభాకు ఓ ఐడెంటిటీ దక్కింది. కానీ ఏం లాభం ఆ సక్సస్‌ని మాత్రం కొనసాగించలేకపోయింది. ఆ తర్వాత నటించిన డిస్కోరాజా, సోలో బ్రతుకే సో బెటర్, అల్లుడు అదుర్స్, మ్యాస్ట్రోలాంటి చిత్రాలు డిజాస్టర్లు అయ్యాయి. దీంతో నభా టాలీవుడ్ లో ఏకంగా మూడేళ్ల పాటు కనిపించడం మానేసింది. మళ్లీ 2024లో డార్లింగ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సినిమా కూడా ఫ్లాప్ అయింది. ఇలా ఇన్నిఫ్లాప్‌లు చూసిన బ్యూటీకి తెలుగులో మరో అవకాశం అంటే జరిగే పని కాదని అంతా డిసైడ్ అయ్యారు. కానీ అప్పుడే ఓ పాన్ ఇండియా సినిమాలో ఛాన్స్ అందుకుని సర్ ప్రైజ్ చేసింది. నిఖిల్ హీరోగా స్వయంభూ చిత్రం తెర కెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఓ హీరోయిన్‌గా నభా నటేష్‌ని దర్శకుడు భరత్ కృష్ణమాచారి ఛాన్స్ ఇచ్చాడు. ఇందులో అమ్మడు ఓ శక్తివంతమైన పాత్రలోనే కనిపించనుంది. హీరోకు ధీటుగా ఆ రోల్ ఉంటుందని ప్రచారం జరుగుతోంది. గుర్రపు స్వారీలు..యుద్ధ సన్నివేశాల్లో నభా నటేష్ కనిపించనుంది. ఆ సన్నివేశాల కోసం ప్రత్యేకంగా ట్రైనింగ్ కూడా తీసుకుంది. కెరీర్ చరమాంకంలో నభా నటేష్‌కి వచ్చిన ఓ గొప్ప అవకాశంగానే ఈ చిత్రాన్ని చెప్పాలి. ఇలాంటి సినిమాల్లో భాగమవ్వాలని ఎంతో మంది నటీమణులు ఆశపడుతుంటారు. డ్రీమ్ రోల్స్ అన్నవి ఇలాంటి కథలకే ఆస్కారం ఉంటుంది. కాబట్టి యువరాణి పాత్రలన్నవి ఇలాంటి సినిమాలతోనే సాధ్యమవుతుంటాయి. అలాంటి పాత్రలో నభానటేష్ ఛాన్స్ అందుకోవడంతో అదృష్టవంతురాలేనే చెప్పాలి. అదెలా ఉన్నా సినిమా సక్సస్ మాత్రమే నభా నటేష్ కెరీర్ డిసైడ్ చేసేది. ఇప్పటికే చాలా ఛాన్సులొచ్చాయి. కానీ ఇదే చివరి ఛాన్స్. అదీ ఏడాది గ్యాప్ తర్వాత రిలీజ్ అవుతున్న చిత్రమిది. ఈ సినిమా విజయం సాధిస్తే నభా నటిగా మళ్లీ బిజీ అవుతుంది. కొత్త అవకాశాలకు అవకాశం ఉంటుంది. ఇతర భాషలకు కూడా ప్రమోట్ అయ్యే ఛాన్స్ ఉంటుంది. పాన్ ఇండియాలో ఓ గుర్తింపు దక్కుతుంది. నభా నటేష్ కేవలం తెలుగు, కన్నడ చిత్రాలు తప్ప మరే భాషల్లోనూ పని చేయలేదు. స్వయంభూ సక్సెస్‌తో అన్ని భాషల్లోనూ బిజీ అవ్వాలని ఆశిద్దాం.

# రౌడీ నుంచి ఇది కదా కావాల్సింది!



కళింగ పట్నంలో ఇంటికొకడు నేను రౌడీని అని చెప్పుకుని తిరుగుతాడు. కానీ ఇంటి పేరునే రౌడీగా మార్చుకున్నోడు ఒక్కడే ఉన్నాడు. జనార్ధన...రౌడీ జనార్ధన... రౌడీ హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న లేటెస్ట్ మూవీ రౌడీ జనార్ధనలోనిది ఈ డైలాగ్. రీసెంట్‌గా విడుదల చేసిన గ్లింప్స్‌లో రైడీ గెటప్, గోదావరి యాసలో తను చెప్పిన మాస్ డైలాగ్ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. రా అండ్ రూత్‌లెస్ క్యారెక్టర్‌లో విజయ్ కనిపించిన తీరు, తన మేకోవర్ టెర్రిఫిక్‌గా ఉందని ఫ్యాన్స్, సినీ లవర్స్ అంటున్నారు. రాజుని సింహాసనంపైనే కూర్చోబెట్టాలి. బంటుని కాపలాగే ఉంచాలి. అలా కాకుండా రాజుని కాపలాకు పెట్టి బంటుని సింహాసంపైన కూర్చోబెడితే అది చూడ్డానికి ఎబ్బెట్టుగా ఉంటుంది. విజయ్ దేవరకొండ విషయంలోనూ అర్జున్‌రెడ్డి వంటి బ్లాక్ బస్టర్ మూవీ తరువాత ఇదే జరుగుతూ వచ్చింది. ఈ సినిమాలో విజయ్ జీవిత కాలంలో ఏ ఆర్టిస్ట్‌కు లభించని క్యారెక్టర్లో కనిపించాడు. ఒక్క సినిమాలో ఇన్ని వేరియేషన్స్ ఉన్న క్యారెక్టర్ లభించడం చాలా చాలా అరుదు. అలాంటి క్యారెక్టర్‌ని టేకింగ్ గ్రాంటెడ్ అనే స్థాయిలో పోషించి ఔరా అనిపించాడు.. పాథ్‌బ్రేకింగ్ బ్లాక్ బస్టర్‌ని అందుకున్నాడు. అయితే ఆ తరువాత విజయ్ క్రేజ్‌కు తగ్గ స్టోరీస్‌ని, క్యారెక్టర్స్‌ని ఎంచుకోవడంలో విఫలమయ్యాడు. నటుడిగా తనకున్న క్యాలిబర్‌ని గుర్తించకుండా తను నచ్చిన, తన వద్దకు వచ్చిన కథలని ఎంచుకుంటూ తన క్రేజ్‌ని తానే తగ్గించుకుంటూ పోయాడు. వరుసగా తప్పటడుగులు వేస్తూ వచ్చాడు. ఇదే సమయంలో లైగర్‌తో బ్లండర్ మిస్టేక్ చేసి మరింత కూరుకుపోయాడు. అర్జున్‌రెడ్డి టైమ్‌లో విజయ్ దేవరకొండని చూసి కేరింతలు కొట్టిన రౌడీ ఫ్యాన్స్ లైగర్ తరువాత నుంచి నీరసించిపోయారు. మళ్లీ రౌడీకి తగ్గ సినిమా ఎప్పుడు? అని ఆశగా ఎదురు చూడటం మొదలు పెట్టారు. ఇన్నాళ్లకు రౌడీ జనార్ధనతో ఆ కల నెరవేరేలా కనిపిస్తోందనే వాదన వినిపిస్తోంది. ఈ మూవీ గ్లింప్స్, అందులో విజయ్ దేవరకొండ మేకోవర్, గోదావరి యాసలో తను పలికిన డైలాగ్స్ చూసిన ఫ్యాన్స్ ఇది కదా రౌడీ నుంచి కావాల్సింది అని కామెంట్‌లు చేస్తున్నారు. రౌడీ జనార్ధనని 80వ దశకం నేపథ్యంలో సాగే ఒక రౌడీ ప్రస్థానం ఆధారంగా తెరకెక్కిస్తున్నాడుగా తెలుస్తోంది. పవర్‌ఫుల్ స్టోరీ, క్యారెక్టర్ కూడా అంతే పవర్‌ఫుల్‌గా ఉండటం, బ్లాక్ బస్టర్ హిట్టు కోసం విజయ్ ఎదురు చూస్తుండటంతో ఈ సినిమాకు సంబంధించి భాష, యాస, క్యారెక్టర్ మేకోవర్ విషయాలలో డైరెక్టర్‌కు మించి కేర్ తీసుకున్నాడట. ఇందులో విజయ్ గోదావరి యాసలో సాగే క్యారెక్టర్ చేస్తున్నాడు.

ఇందు కోసం గోదావరి యాసపై పట్టు సాధించి మరీ డైలాగ్‌లు చెప్పాడని, ఆయన మాట్లాడు తుంటే చాలా బాగుందని డైరెక్టర్ చెప్పడం గమనార్హం. ఇదిలా ఉంటే ఇక్కడో విషయం గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి.. విజయ్ దేవరకొండ బేసిక్‌గా తెలంగాణ వాసి. ఇందులో గోదావరి యాసలో సాగే పాత్రలో నటిస్తుండగా ది ప్యారడైజ్ మూవీలో గోదావరి జిల్లాకు చెందిన నాని తెలంగాణ యాసలో సాగే పాత్రలో నటిస్తుండటం అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఇక ఈ రెండు సినిమాలు ఇప్పుడు టాక్ ఆఫ్ ది టాలీవుడ్‌గా మారాయి. రౌడీ జనార్ధన 2026 డిసెంబర్‌లో రిలీజ్‌కు రెడీ అవుతుంటే నాని ది ప్యారడైజ్ మార్చి 26న పాన్ ఇండియా మూవీగా రాబోతోంది.

# పింక్ డ్రెస్‌లో మెరిసిపోతున్న భాగ్యశ్రీ.. ఆ చిరునవ్వే హైలైట్!



టాలీవుడ్‌లో ఇప్పుడు యూత్ క్రష్ ఎవరు అంటే ఠక్కున వినిపించే పేరు భాగ్యశ్రీ బోర్సే. తక్కువ టైమ్ లోనే తనకంటూ ఒక ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్‌ను క్రియేట్ చేసుకుంది ఈ భామ. కేవలం సినిమాలతోనే కాకుండా సోషల్ మీడియాలో కూడా అమ్మడు చాలా యాక్టివ్‌గా ఉంటుంది. ఎప్పటికప్పుడు తన లేటెస్ట్ ఫొటోషూట్స్‌తో నెటిజన్లను కట్టిపడేస్తుంటుంది. సాధారణంగా హీరోయిన్లు గ్లామర్ షోతో ఆకట్టుకోవాలని చూస్తుంటారు. కానీ భాగ్యశ్రీ మాత్రం సంప్రదాయ బద్ధంగా కనిపిస్తూనే మోడర్న్ టచ్ ఇవ్వడంలో దిట్ట. లేటెస్ట్‌గా ఆమె తన ఇన్స్టాగ్రామ్‌లో షేర్ చేసిన కొన్ని ఫొటోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ ఫొటోల్లో ఆమె అందం చూసి కుర్రకారు ఫిదా అవుతున్నారు. ఈ లేటెస్ట్ ఫొటోల్లో భాగ్యశ్రీ పింక్ కలర్ డిజైనర్ వేర్‌లో మెరిసిపోతోంది. “ఒక అమ్మాయి పింక్‌తో ప్రేమలో పడితే, ఆమె గుండె నవ్వుతుంది” అనే క్యాప్షన్‌తో ఆమె ఈ ఫొటోలను షేర్ చేసింది. ఆ డ్రెస్‌కు తగ్గట్టుగా సింపుల్ జ్యువెలరీ, చెవికి చిన్న కమ్మలు పెట్టుకుని చాలా క్లాసీగా కనిపిస్తోంది. ముఖ్యంగా ఆమె తల నిమురుకుంటూ నవ్వుతున్న స్టిల్ అయితే చాలా క్యూట్‌గా ఉంది. మరో ఫొటోలో దుపట్టాతో ఆడుకుంటూ, వెనక్కి తిరిగి చూస్తున్న చూపులు ఎవరినైనా కట్టిపడేసేలా ఉన్నాయి. బ్యాక్ గ్రౌండ్‌లో బ్లూ లైటింగ్, ఆమె వేసుకున్న పింక్ డ్రెస్ కాంబినేషన్ ఫొటోలకు కొత్త కళను తీసుకొచ్చింది. గ్లామర్ అంటే కేవలం ఎక్స్‌పోజింగ్ కాదని, ఇలా నిండుగా ఉంటూనే కిల్లింగ్ లుక్స్ ఇవ్వొచ్చని ఆమె నిరూపిస్తోంది. ఆ నవ్వులోనే ఏదో మ్యాజిక్ ఉందని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ముంబై నుంచి వచ్చినా కూడా అచ్చమైన తెలుగు అమ్మాయిలా కనిపించడం భాగ్యశ్రీ స్పెషాలిటీ. ఈ పింక్ డ్రెస్‌లో ఆమెను చూస్తుంటే ఏదో బాపు బొమ్మలా అనిపిస్తోంది. సోషల్ మీడియాలో ఈ పిక్స్‌కు లైకుల వర్షం కురుస్తోంది. ఇప్పటికే లక్షకు పైగా లైక్స్ వచ్చాయంటే ఆమె క్రేజ్ ఏ రేంజ్‌లో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక భాగ్యశ్రీ బోర్సే అటు సినిమాల్లోనూ, ఇటు సోషల్ మీడియాలోనూ దూసుకుపోతోంది.

అందం, అభినయం రెండు ఉన్న ఇలాంటి హీరోయిన్ టాలీవుడ్‌కు దొరకడం ప్లస్ పాయింట్. రాబోయే రోజుల్లో స్టార్ హీరోల సినిమాల్లో ఆమె మరిన్ని అవకాశాలు అందుకోవడం ఖాయం అనిపిస్తోంది.

# నందికేశ్వర కూచిపూడి కలక్షేత్రం ఆధ్వర్యంలో చిన్నారుల కూచిపూడి నృత్య పోటీలు

## - ముఖ్య అతిథులుగా 25 కళా సంఘాల అమరావతి కృష్ణారెడ్డి, నారాయణ హాస్పిటల్ ఏజిఎం భాస్కర్ రెడ్డి










**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్ నందు సిసిఆర్ఎఫ్ శ్రీ నం దికేశ్వర కూచిపూడి కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కూచి పూడి నృత్య ప్రదర్శన పోటీలు ఘనంగా నిర్వహించారు 8 సంవ త్సరాల నుండి 15 ఏళ్ల లోపు చిన్నారులకు కూచిపూడి నృత్యంతో అలరించారు శరణ్య రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో సిసిఆర్ఎఫ్ డైరెక్టర్ సంతోష్ మిశ్రా ఇచ్చేశారు. ప్రథమ బహుమతి దాసరి రిషికేష్, ద్వితీయ బహుమతి హారిక శ్రీజ, తృతీయ బహుమతి సిహెచ్ పర్ణిక రెడ్డిలకు అందజేశారు న్యాయ నిర్ణేతలుగా ఎన్.వి.రమణయ్య, కల్పన వ్యవహరించారు. అతిథులకు బహుమతి ప్రధానం చేశారు. శ్రీకర్ రెడ్డి జ్యోత్స్నల వారి ఆధ్వర్యంలో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

# ఘనంగా గణిత దినోత్సవం





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** జాతీయ గణితశాస్త్ర దినోత్సవ వేడుకలు స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం ఘనంగా జరిగాయి. విద్యార్థినిలు గణిత శాస్త్రానికి సంబంధించిన ఎగ్జిబిట్స్ ప్రదర్శించారు. ఈ ఎగ్జిబిట్స్ ను ప్రధానోపాధ్యాయులు సి.హెచ్. రమేష్ కుమార్, ఉపాధ్యాయులు తిలకించగా, వాటి ఉపయోగాలను విద్యార్థినీలు వివరించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థినిలు లెక్కలకు సంబంధించి ప్రదర్శించిన స్కిట్లు శభాష్ అనిపించాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రమేష్ కుమార్ మాట్లాడుతూ, గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస్ రామానుజన్ గణితంలో చేసిన గమ్మత్తులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# విజయవంతమైన పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ మేళా

## - సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్ ఉపేంద్ర



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ సర్కిల్ స్థాయిలో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకూ నిర్వహించిన పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రత్యేక మేళా గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలో విజయవంతంగా పూర్తి చేసామని సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్ బి.ఉపేంద్ర అన్నారు. సోమవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ "తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్ లభించే ఈ బీమా పథకంలో గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలో 200 పై చిలుకు కుటుంబాలకు 5 కోట్ల 70 లక్షల రూపాయల బీమా భరోసా కల్పించామని అన్నారు. ఈ సందర్భంగా మేళాను విజయవంతం చేసిన సిబ్బంది అందరికీ ఆయన అభినందనలు తెలిపారు.

# ఉద్యమించిన పిఎసిఎస్ ఉద్యోగులు

## - డిసిసిబి కార్యాలయం వద్ద ధర్నా - సమస్యలు పరిష్కారం కాకపోతే వెనక తగ్గేది లేదు - పిఎసిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు



**విజయనగరం, (రాజధాని వార్తలు):** పిఎసిఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కార్మికులంతా డిసిసిబి బ్యాంకు వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జునకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి కామేశ్వరరావు మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం గత 30, 40 సంవత్సరాలుగా పిఎసిఎస్‌లలో ఉద్యోగులుగా పని చేస్తున్న వీరికి న్యాయం చేయాలన్నారు. ఉద్యోగులందరికీ వెంటనే జీవో నెంబర్ 36 అమలు చేయాలని, పెండింగ్ లో ఉన్న మధ్యాంతర భృతి వెంటనే ఇవ్వాలన్నారు. రైతుల రుణాలను ఉద్యోగుల ద్వారానే ఇవ్వాలన్నారు. విజయనగరం డిసిసిబి పరిధిలోగల 95 పీఏసీఎస్ లలో ఉన్న 300 మంది ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులకు అమలయ్యే రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. ఉద్యోగులకు ఐదు లక్షలకు తక్కువ కాకుండా ఆరోగ్య బీమా కల్పించాలని ఉద్యోగి సర్వీసులో మరణిస్తే ఆ కుటుంబం ఆధారం లేకుండా పోతుందని కావున ప్రతి ఉద్యోగికి 20 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ కల్పించాలన్నారు. 2019 తరువాత సంఘాలలో చేరిన ఉద్యోగులందరికీ రెగ్యులర్ చేయాలన్నారు. సహకార సంఘాలలో పని చేస్తున్న ఉద్యోగులకు ఎట్టి పరిస్థితుల్లో రాజకీయ వేధింపు ఉండరాదన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 29న రాష్ట్రవ్యాప్తంగా సహకార సంఘాల ఉద్యోగులతో విజయవాడ ధర్నా చౌక్ వద్ద మహా ధర్నా నిర్వహిస్తామన్నారు. అనంతరం జనవరి 5న 26 జిల్లాల ఉద్యోగులతో విజయవాడ ధర్నా చౌక్ వద్ద రిలే నిరాహార దీక్ష కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టనున్న వివిధ నిరసన కార్యక్రమాలలో ఉద్యోగులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఆర్ సత్యారావు జనరల్ సెక్రెటరీ బి రాము నాయుడు, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ డి నారాయణరావు, ట్రెజరర్ ఏవి సత్యనారాయణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఓ గిరిబాబు, ఆర్ వి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి గ్రామీణ ఆదర్శ యోజన పథకాన్ని విజయవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రధానమంత్రి గ్రామీణ ఆదర్శ యోజన (పి ఎం ఎ జి వై) పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ పథకం అమలుపై సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, పథకంలో భాగంగా, 500 జనాభా కలిగి, జనాభాలో కనీసం 40 శాతం షెడ్యూల్డ్ కులాల వారు నివసించే గ్రామాలను ఎంపిక చేయాలని కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని మెరకముడిదాం, వంగర, తెర్లాం, ఆర్.ఆమదాలవలస మండలాల నుండి ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి ప్రతిపాదించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ పథకానికి సాంఘిక సంక్షేమ శాఖను నోడల్ శాఖగా నియమించడం జరిగిందని, వారి సమన్వయంతో ఆయా గ్రామాల్లో సమగ్ర అభివృద్ధి చర్యలు చేపట్టాలని సూచించారు. ఎంపిక చేసిన గ్రామాల్లో త్రాగునీరు, విద్య, వైద్యం, సోషల్ సెక్యూరిటీ, గ్రామీణ రహదారులు, విద్యుత్, వ్యవసాయం, ఆర్థిక అభివృద్ధి, డిజిటలైజేషన్ జీవనోపాధి మరియు నైపుణ్యాభివృద్ధి వంటి పది కీలక రంగాల్లో మౌలిక వసతుల అభివృద్ధి జరిగేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ఈ పథకం కింద ప్రతి గ్రామానికి కేంద్ర ప్రభుత్వం నుండి రూ.20 లక్షల నిధులు అందుతాయని, అదనపు అవసరాలకు సంబంధిత శాఖల ద్వారా కన్వర్జెన్స్ పద్ధతిలో నిధులు సమీకరించి గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమాల పర్యవేక్షణ కోసం జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ ఎం. అన్నపూర్ణమ్మ, డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్ పాణి, జడ్పీ సీఈఓ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ తదితర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎంపీ శ్రీ భరత్ దృష్టికి అవనాం గ్రామ సమస్యలు



**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** గ్రామ సమస్యలపై విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు శ్రీ భరత్ దృష్టి పెట్టారు. ఈ నేపథ్యంలో సోమవారం భీమిలి మండలంలోని తాళ్లవలస పంచాయతీలో గ్రామ ప్రజలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రజా సమస్యలపై సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో గ్రామాల్లోనూ అభివృద్ధి పనుల గురించి ప్రజలకు అందే అభివృద్ధి ఫలాలు గురించి తెలుసుకొని ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడాలని ఉద్దేశంతో ఈ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీ భరత్‌ను అమనాం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు భీమిలి నియోజకవర్గం లీగల్ సెల్ ప్రెసిడెంట్ మరగడ రఘు రామిరెడ్డి, అమనం గ్రామ తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ చుక్క ఆదిరెడ్డి, ఏఎంసి డైరెక్టర్ చుక్క ఉమాదేవి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొల్లు నరసింహ, మరగడ గౌరీ మరియు జనసేన గ్రామ పార్టీ నాయకులు అడపా వేణుగోపాల్, సరగడరెడ్డి తదితరులు పాల్గొని తమ గ్రామ సమస్యలను ఎంపి భరత్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో జీరు శ్రీహరి చుక్క రమణ నేలకు ఎల్లయ్య రెడ్డి కర్రి నర్సింగ్ రావు కర్రీ బంగార్రాజు జువాయి శ్రీను దువ్వ రమణ చుక్క సాయికుమార్ అడప కిషోర్ కర్రి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యాంధ్ర లక్ష్యం దిశగా కూటమి ప్రభుత్వం : టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు



**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** పోలియో రహిత భారతదేశమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన పోలియో చుక్కలు కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు ప్రారంభించారు. భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ఆదేశానుసారం భీమిలి జోన్ 3వ డివిజన్ నేరళ్లవలస కోలనీ, ఎగువపేట గ్రామంలో జరిగిన పల్స్ పోలియో కార్యక్రమంలో గంటా నూకరాజు పాల్గొని మాట్లాడారు. మానవ జీవితంలో మనిషి యొక్క మనుగడను దెబ్బతీసే వైరస్‌లలో పోలియో ఒకటని ఈ పోలియో 5 సంవత్సరాలలోపు పిల్లలపై ఎక్కువగా ప్రభావం చూపిస్తుందని అన్నారు. అందుకే పోలియోను పూర్తిగా అరికట్టుటకు 0–5 సంవత్సరాలలోపు పిల్లలందరికీ రెండు పోలియో చుక్కలు వేయడం ద్వారా పూర్తిగా నివారించవచ్చని ఒకప్పుడు దేశంలో దీని ప్రభావం చాలా ఎక్కువగా ఉండేదని కానీ పోలియో నివారణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టడంతో అధిక శాతం అరికట్టామని ఇంకా మీ అందరి సహకారంతో పూర్తిగా అరికట్టి పోలియో రహిత భారతదేశంగా మన దేశాన్ని చూస్తామని అన్నారు. ఈ విషయంలో ప్రతీ తల్లిదండ్రులు ముందుచూపుతో ఆలోచించి ఐదేళ్లలోపు పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని గంటా నూకరాజు కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు వియ్యపు అప్పల నాయుడు, అల్లిపిల్లి సతీష్, రేగాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ స్టడీ మెటీరియల్ అందజేత

## - సోషల్ టీచర్ "పైడితల్లి"ని ప్రశంసించిన డిప్యూటీ డి.ఈ.ఓ




**గజపతినగరం, (రాజధాని వార్తలు):** స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అడ్డూరి పైడితల్లి తన సొంత ఖర్చులతో పదోతరగతి విద్యార్థినీల కోసం తయారు చేసిన స్టడీ మెటీరియల్ బొబ్బిలి డివిజన్ డిప్యూటీ డి.ఈ.ఓ కే.మోహన్ రావు విద్యార్థులకు అందజేశారు. ఎంతో శ్రమించి విద్యార్థినీలకు ఉపయోగపడే విధంగా తయారుచేసిన ఈ స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయుక్తం కాగలదని డిప్యూటీ డిఇఓ కె. మోహన్ రావు ఈ సందర్భంగా అన్నారు. ఒక్కొక్క విద్యార్థికి బుక్లెట్ రూపంలో తయారుచేసి మెటీరియల్ అందజేసిన సోషల్ టీచర్ పైడితల్లిని ప్రశంసించారు. ప్రతి ఏడాది ఈ విధంగా మెటీరియల్ తయారు చేసి అందజేయడం పైడితల్లి మాస్టారు చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. ఇందులో రూపొందించిన మెటీరియల్ చక్కగా చదువుకుంటే పదిలో మంచి మార్కులు సాధించగలుగుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ - 2 బి. సాయిచక్రధర్, ప్రధానోపాధ్యాయులు సి.హెచ్. రమేష్ కుమార్, సోషల్ టీచర్లు అడ్డూరి పైడితల్లి, మంగాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వైసీపీ నేత రమణారావు అధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు



**ఉప్పలగుప్తం, (రాజధాని వార్తలు):** చల్లపల్లి గ్రామం జగ్గరాజు పేటలో వైసీపీ సీనియర్ నేత కుంచే రమణారావు స్వగృహం నందు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. రమణారావు ఏర్పాటు చేసిన భారీ కేక్ మరియు మహిళలకు సుమారు ఐదు వందల మందికి చీరలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంటు సభ్యురాలు చింతా అనురాధ, ఉప్పలగుప్తం మండలం పరిషత్ అధ్యక్షులు దంగేటి రాంబాబు, అల్లవరం జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైసీపీ ఎస్.ఈ.సి మెంబర్ కుడిపూడి భరత్ భూషణ్ శైలజ, సాయి రాజు, తోట శ్రీను, కుడిపూడి శాంతిభూషణ్, గోపవరం ఎంపిటిసి సభ్యులు కొంకి ఏడుకొండలు, మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజ్, మాజీ సర్పంచ్ నక్క సంపత్, సాధనాల శ్రీను, పందిరి సుబ్బరాజు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.

# ఘనంగా గణిత శాస్త్ర దినోత్సవ వేడుకలు



**మక్కువ, (రాజధాని వార్తలు):** మండలంలో గల కాశీపట్నం పంచాయతీ కేజీబీవీ పాఠశాల యందు గణిత శాస్త్ర శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని గణిత శాస్త్ర దినోత్సవ వేడుకలను సోమవారం నాడు ఘనంగా నిర్వహించారు ముందుగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రత్యేక అధికారి జి నాగదుర్గ మాట్లాడుతూ విద్యార్థులు గణితశాస్త్రం పై పట్టు సాధించాలని అన్నారు గణితాన్ని కష్టంగా కాకుండా ఇష్టంగా నేర్చుకోవాలని రాబోయే కాలంలో పోటీ పరీక్షలకు అలాగే ఉద్యోగాల అవకాశాల కొరకు గణితం నేర్చుకోవడం ఆవశ్యకం ఎంతైనా ఉందని గణితం నేర్చుకోవడం ద్వారా ఎన్నో అద్భుతాలు సృష్టించి విద్యార్థులు బంగారు భవితకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ గణిత ఆకృతులు ఆకట్టుకున్నాయి. అనంతరం ముందస్తు క్రిస్మస్ వేడుకలు పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా కొత్తపేట పంచాయితీ ఆవిర్భావ దినోత్సవం

## - 86 వసంతాలు పూర్తి చేసుకుని 87లో అడుగిడిన కొత్తపేట పంచాయతీ



**కొత్తపేట, (రాజధాని వార్తలు):** 1939లో ఏర్పడిన కొత్తపేట పంచాయతీ 86 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం కొత్తపేట పంచాయతీ వద్ద సర్పంచ్ బూసి జయలక్ష్మి భాస్కరరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి గ్రామస్థులు సమక్షంలో వేడుక జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాసరావు, ముత్యాల బాబ్జి, మిద్దె ఆదినారాయణ, గనిశెట్టి వీరేష్, కదలి భీమేశ్వరరావు, చిక్కం హనుమంతు, కాశి ధనరాజు, తమ్మన సాయి ప్రసాద్, శీలం సూర్య చంద్ర రావు, సీతారామరాజు, ముద్రగడ ఫణి,కుడుపూడి సత్తిబాబు, బూసి విష్ణుమూర్తి, అన్యం మునేస్ రావు, జోగి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# 8వ ప్రపంచ మాదిగ దినోత్సవం పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు



**భద్రాచలం, (రాజధాని వార్తలు):** ఇంటలెక్చువల్ ఫోరం ఫర్ మాదిగ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన విజయవాడ కేంద్రంగా జరగబోవు ఎనిమిదవ ప్రపంచ మాదిగ దినోత్సవం పోస్టర్ను భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు ఈరోజు క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెల్లం వెంకటరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న మాదిగలందరూ 8వ ప్రపంచం దినోత్సవం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తమ హక్కుల సాధన కోసం మాదిగలందరూ ఐక్యమత్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ముద్ద పిచ్చయ్య, సీనియర్ దళిత నాయకులు చాట్ల రవికుమార్, తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షులు గురజాల వెంకటేశ్వర్లు, పొడుతూరి ప్రేమ్ సాయి, తోకల దుర్గాప్రసాద్, కనుక శ్రీను, విస్సంపల్లి ముత్యం తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదల ఆశా కిరణం జగన్ మోహన్ రెడ్డి






**మక్కువ, (రాజధాని వార్తలు):** జగన్మోహన్ రెడ్డి జన్మదినము సందర్భంగా మండల కేంద్రం మక్కువ సంక్షేమ పథకాలా సృష్టికర్త పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వైఎస్ఆర్సిపి ప్రియతమ నేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి 53వ జన్మదినం పురస్కరించుకొని నేడు రాష్ట్ర వైఎస్ఆర్సిపి కార్యదర్శి మరియు కురుపాం పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గాల ఇంచార్జ్ మక్కువ మండలం జడ్పిటిసి మావుడి శ్రీనివాసరావు, మక్కువ మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు మావుడి రంగు నాయుడు, మక్కువ మండల వైఎస్ఆర్సిపి యువ నాయకులు మావుడి తిరుపతిరావు, మావుడి చరణ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అనంతరం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలో గల వైఎస్ఆర్సిపి సర్పంచులు ఎంపీటీసీలు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్పిటిసి మావుడి శ్రీనివాసరావు వైఎస్ఆర్సిపి కార్యకర్తలను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ. కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలి అంటూ పిలుపునిచ్చారు. కార్యకర్తలకు వైఎస్ఆర్సిపి పార్టీ నిరంతరం అండగా ఉంటుందని కూటమి ప్రభుత్వ దౌర్జన్యాలను ఎదుర్కొనేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరంగా తెలియజేస్తూ రాబోయే రోజుల్లో జరిగే ఎన్నికల్లో కూటమి పార్టీని మట్టి కరిపించి మళ్లీ మన ప్రియతమ నేత జగన్మోహన్ రెడ్డిని సీఎంగా నిలబెట్టుకోవడానికి కార్యకర్తలందరూ శక్తి వంచన లేకుండా పనిచేసి మరల అధికారంలోకి పార్టీని తీసుకువచ్చే బాధ్యత మన అందరిపై ఉందని. కూటమిపాలకుల అబద్ధపు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పుకొట్టాలని ఈ సందర్భంగా కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం కార్యకర్తలతో కలసి బైక్ ర్యాలీ నిర్వహించారు.

# పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం : మంత్రి "కొండపల్లి" పిలుపు





**బొండపల్లి/ విజయనగరం, (రాజధాని వార్తలు):** పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతీఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు, పేదరిక నిర్మూలన మరియు ఎన్నారై సాధికారత సంబంధాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆయన బొండపల్లి మండలం గొట్లాం గ్రామంలో పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రంలో ఆయన స్వయంగా చిన్నారులకు పోలియో చుక్కల వేసి ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. పోలియో రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిందని మంత్రి అన్నారు. ఇప్పటికే పోలియో దాదాపు నిర్మూలింపబడినప్పటికీ, ముందు జాగ్రత్తగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందని చెప్పారు. జిల్లాలో సుమారు 2 లక్షల మందికి పోలియో చుక్కలను వేసేందుకు 1172 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఐదేళ్ల లోపు వయసున్న చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, వారి భవిష్యత్తును సురక్షితం చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని పేర్కొన్నారు. ఒక్క చిన్నారి కూడా ఈ చుక్కల కార్యక్రమానికి దూరం కాకూడదని, క్షేత్రస్థాయిలో అధికారులు మరియు ఆరోగ్య కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి శతశాతం లక్ష్యాన్ని చేరుకోవాలని మంత్రి ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రేపటి నుంచి ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలను వేయాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో గజపతినగరం ఏఎంసి ఛైర్మన్ పివివి గోపాలరాజు, డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి, అదనపు డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ కె.రాణి, ఐసిడిఎస్ సిడిపిఓ ఉమాభారతి, స్థానిక వైద్యాధికారి డాక్టర్ సత్యనారాయణ, స్థానిక నాయకులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, పాఠశాల సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో తల్లులు తమ చిన్నారులతో పాల్గొన్నారు.



# నారాయణ బాలికల రెసిడెన్షియల్ స్కూల్లో ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నేషనల్ మ్యాథమెటిక్స్ డే సందర్భంగా నారాయణ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ ధనలక్ష్మిపురంలో సోమవారం గణిత దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏజీఎం రవివర్మ విచ్చేసి గణిత ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు అనంతరం ఆయన గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పాఠశాల అసెంబ్లీ సమావేశంలో రామానుజన్ గారి గణిత శాస్త్రానికి చేసిన అపూర్వ సేవలను స్మరించుకుంటూ ప్రసంగాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత శాస్త్రం ప్రాధాన్యత, దాని ప్రయోజనాలు, విద్యార్థుల భవిష్యత్తులో గణిత పాత్రపై అవగాహన కల్పించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో గణితంపై ఆసక్తి పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని రవి వర్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి సన్మానించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# సీతంలో మెగా టెస్ట్ రైడ్, లెర్నర్ లైసెన్స్ డ్రైవ్




**విజయనగరం, (రాజధాని వార్తలు):** స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం కళాశాలలో ధర్మన టీవీఎస్‌తో కలిపి, 160 సి సి అపాచీ మోటార్‌సైకిల్ యొక్క మెగా టెస్ట్ రైడ్‌ను, మరియు లెర్నర్ లైసెన్స్ కళాశాల ప్రాంగణంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల నుండి విశేషమైన స్పందన లభించింది, డ్రైవ్ సమయంలో దాదాపు 300 మంది విద్యార్థులు లెర్నర్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అలాగే సురక్షితమైన రైడింగ్ పద్ధతులను ప్రోత్సహించడానికి, ధర్మాన టీవీఎస్ ప్రతి అపాచీ కొనుగోలుపై విద్యార్థులకు ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది, లెర్నర్ లైసెన్స్ సహాయం మరియు ఉచితంగా హెల్మెట్‌ను కూడా అందించింది. ఈ కార్యక్రమంలో ధర్మాన టీవీఎస్ విజయనగరం బ్రాంచ్ మేనేజర్ బి.కృష్ణకుమారి మరియు సేల్స్ సిబ్బంది చురుకుగా పాల్గొన్నారు, వారు రిజిస్ట్రేషన్ మరియు టెస్ట్ రైడ్ ప్రక్రియ అంతటా విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. సీతం ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎన్.సతీష్‌కుమార్ మరియు కళాశాల చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ సత్యనారాయణ కళాశాల తరఫున నిర్వాహకులకు సహాయ సహకారాలు అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యన్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# సంస్కరణాత్మక పాలనకు స్ఫూర్తి చంద్రబాబు : కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఏదైనా పని మొదలు పెట్టినపుడు ఎన్ని అడ్డంకులు ఎదురయినా వెరువక తుదికంటా లక్ష్యం కోసం శ్రమించడమే కార్య సాధకుడి నైజం. అలాంటివారు ఉత్తములు. ఆ కోవకు చెందుతారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. అందుకే ప్రముఖ దిన పత్రిక ది ఎకనమిక్స్ టైమ్స్ ప్రతి ఏటా అందించే ప్రతిష్టాత్మక "బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు ఆయనను వరించింది. ఇప్పటివరకు ఎకనామిక్ టైమ్స్ కేవలం ప్రముఖ వ్యాపారవేత్తలకు మాత్రమే ఈ అవార్డులను ప్రకటిస్తూ వస్తోంది. కానీ మొదటిసారి ఒక పొలిటికల్ లీడర్ విజన్‌కు మెచ్చి ఈ అవార్డును ప్రకటించింది. ఇప్పటివరకు ఈ అవార్డు అందుకున్న ఏకైక రాజకీయవేత్తగా చంద్రబాబు నిలిచారు. దీన్నిబట్టే ఆయన ఏ స్థాయిలో ఏపీకి పెట్టుబడులు తీసుకు వస్తున్నారో అనేది క్లియర్‌గా అర్థమైపోతుంది. ప్రస్తుతం ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థలతో సమానంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి కోసమే కాకుండా, గ్లోబల్ పోటీలో తనకంటూ ఒక గౌరవనీయమైన స్థానం కోసం పోటీ పడే విధంగా తీర్చిదిద్దిన ఆర్థికవేత్త చంద్రబాబు నాయుడు. ఈ పోటీలో ముందంజలో నిలిపి ఒక రాష్ట్రాన్ని ఆర్థికంగా, సామాజి కంగా, పరిపాలన పరంగా బలపరచగల నాయకుడని నిరూపించినందునే చంద్రబాబుకు ప్రతిష్టాత్మక అవార్డు లభించిందనడంలో సందేహం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో వ్యాపార అనుకూల విధానాలు అమలు, పారిశ్రామిక సంస్కరణలు, పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించడంలో చంద్రబాబు నాయుడిది అందెవేసిన చేయి. ఆయన అనుభవంతోనే నేడు రాష్ట్రం పెట్టుబడులకు గమ్యస్థానంగా మారిందనే చెప్పాలి. రాష్ట్రాభివృద్ధితో పాటు నవతరం భవిష్యత్తు కోసం చంద్రబాబు అమలు చేస్తున్న పరిపాలనా విధానాలు, పారిశ్రామిక సంస్కరణల ఫలితమే ఆంధ్రప్రదేశ్ ప్రగతి వైపు వేగంగా పరుగులు పెడుతున్నది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లభించిన అవార్డు అనేది కేవలం గౌరవ సూచిక మాత్రమే కాదు. రాష్ట్రాభివృద్ధి దిశగా ఒక శక్తివంతమైన శబ్ధమనే చెప్పాలి. ఈ అవార్డు పెట్టుబడిదారులకు, ఆర్థిక రంగానికి, ఇంకా ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఒక స్పష్టమైన సందేశంగా భావించవచ్చు. అంతేకాకుండా "ఆంధ్రప్రదేశ్ మరింత వేగంగా పరుగు పెట్టబోతోందనడానికి ఒక సంకేతం. ఎకానమిక్ టైమ్స్ ఇచ్చే అవార్డు అషామాషి కాదు. ఇవి భారత ఆర్థిక వ్యవస్థలోని అత్యుత్తమ మేధావులు, అడ్మినిస్ట్రేటర్లు, పరిశ్రమల నాయకులు అందుకునే ప్రథమ శ్రేణి పురస్కారాలు. అందులోను బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్" అవార్డు అయితే ఇంకా ప్రత్యేకం. ఇది వ్యక్తిగత విజయాన్ని కాదుఒక నాయకుడు నిర్మించిన వ్యవస్థ, ఆయన చూపిన దిశ, ఆయన ముందుచూపు, ఆయన అమలు చేసిన ఆర్థిక, పరిపాలనా సంస్కరణలను సమగ్రంగా అంచనా వేసి ఇచ్చే గుర్తింపు. ఈ అవార్డు సాధారణంగా పరిశ్రమలలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన, ఆర్థిక వ్యవస్థను తిరిగి మానవ సాధికారతకు మలిచిన, పరిపా లనా చర్యలను ప్రపంచ ప్రమాణాలకు చేర్చిన నాయకులు అందుకుంటారు. ఆ క్రమంలో చంద్రబాబు నాయుడు పేరు నిలవడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి లభించిన అరుదైన గౌరవం. గత అయిదేళ్ళ వైసీపీ పాలనలోధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించగలుగుతారా అనే చాలా మంది అనుమానాలను పటాపంచలు చేస్తూ రాష్ట్రాన్ని పారిశ్రామిక పురోగతివైపు ఎలాపరుగులు పెట్టించాలో గత 15 నెలల పాలనలోనే చంద్రబాబు చేసి చూపించారనడానికి ఈ అవార్డే ఒక తార్కాణం. ఎందుకు దేశవ్యాప్తంగా ఎందరో ముఖ్యమంత్రులు ఉన్నప్పటికీ చంద్రబాబు నాయుడునే ఎంపిక చేశారంటే ఆయనకున్న పరిపాలన అనుభవంతో పాటు అనేక స్పష్టమైన, బలమైన కారణాలు ఉన్నాయి. అయిదేళ్ళ వైసీపీ పాలనలో కుదేలు అయిన ఆర్థిక రంగాన్ని గాడిన పెట్టి పునరుద్ధరణలో అసాధారణ వేగంతో పరుగులు పెట్టించడమనేది చంద్రబాబు నాయుడికే సాధ్యమైంది. ఆయన తీసుకున్న చర్యలు వేగం, దూరదృష్టి మరియు ఎగ్జిక్యూషన్ పరంగా దేశవ్యాప్త దృష్టిని ఆకర్షించాయి. అంతేకాకుండా కూటమి పాలనలో 25 కొత్త పాలసీలు తెచ్చిన ఘనత కూడా ఆయనకే దక్కుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే 10.07 లక్షల కోట్ల పెట్టుబడులను ఏపీకి తీసుకొచ్చిన చరిత్ర చంద్రబాబుకే దక్కింది. భారీ స్థాయిలో పెట్టుబడులను తీసుకువస్తూనే ఇంకోవైపు అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలను అందిస్తూ అన్ని రకాలుగా ఏపీని ముందుకు తీసుకెళుతున్నారు. ఏపీని పెట్టుబడుల హబ్‌గా మార్చడంలో చంద్రబాబు విజన్ సూపర్ సక్సెస్ అయింది. అందుకే ఇప్పుడు దేశంలోనే అత్యధిక పెట్టుబడులు వస్తున్న రాష్ట్రంగా ఏపీ నిలిచింది. ఆల్రెడీ అభివృద్ధి చెందిన నగరాలను దాటేసి ఏపీకి పెట్టుబడులు తేవడం అంటే మామూలు విషయం కాదు. ఎంతో చతురతతో బిజినెస్ విజన్ తో పాటు అహర్నిశలు కష్టపడితేనే ఇది సాధ్యమైంది. పెట్టుబడులు ఎలా తీసుకురావాలో చంద్రబాబు నాయుడుకు బాగా తెలుసు కాబట్టి ఆ విజన్‌ను మరోసారి అమలు చేసి సక్సెస్ అయ్యారు. ఈ వయసులో కూడా ఆయన క్షణం కూడా తీరిక లేకుండా ప్రపంచ ప్రముఖ వ్యాపారవేత్తలతో భేటీలు అవుతూ వారిని ఒప్పించి మరీ పెట్టుబడులు పెట్టిస్తున్నారు. వైసీపీ హయాంలో భయభ్రాంతులకు లోనై వెళ్లిపోయిన పెట్టుబడిదారులను కూడా తిరిగి వెనక్కు రప్పిస్తున్నారు. అందుకే ఇప్పుడు ఏపీలో గూగుల్ డేటా సెంటర్ లాంటి అతిపెద్ద కంపెనీ కూడా వచ్చింది. ఇది మామూలు విషయం కాదు. చంద్రబాబు నాయుడుకు విజన్ ఉంది కాబట్టే ఇది సాధ్యమైంది. వైసిపి ఎన్ని విమర్శలు చేసినా సరే వాటిని ప్రజలు పట్టించుకోవట్లేదు. ఇలాంటి అవార్డులే చంద్రబాబు నాయుడు ఎంత అద్భుతంగా పనిచేస్తున్నారో తెలియజేస్తున్నాయి. కొన్ని నెలల్లోనే రూ.21 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు రావడం అరుదైన విషయం. ఇతర రాష్ట్రాలు ఒక సంవత్సరంలో పొందే పెట్టుబడులు, ఏపి కొన్ని నెలల్లోనే సాధించడం అభివృద్ధి శ్రేణిని మార్చిన ఘట్టంగా నిలపడమనేది చంద్రబాబు పాలనా అనుభవం వల్లే సాధ్యమైంది. టెక్నాలజీ ఆధారిత గవర్నెన్స్‌కు కొత్త ఊపు తీసుకు వచ్చారు. చంద్రబాబు అంటే టెక్నాలజీ గవర్నెన్స్. 1990ల్లో హైదరాబాద్ సైబరాబాద్‌కు పునాది వేసినట్లే, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ లో కూడా డిజిటల్ అడ్మినిస్ట్రేషన్ పునర్నిర్మాణానికి ఆయన మొదటి అడుగు వేశారు. రియల్ టైమ్ గవర్నెన్స్‌కు రీ-స్ట్రక్చరింగ్ చేయడం, డేటా-డ్రివెన్ అడ్మినిస్ట్రేషన్‌పై దృష్టి పెట్టడం ఆయనకు ఈ అవార్డు రావడానికి ఒక ప్రధాన కారణం. ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగాల కొరతను తగ్గించడానికి, పరిశ్రమలను పెద్ద ఎత్తున రప్పించడానికి చంద్రబాబు తీసుకున్న చర్యలకు గ్లోబల్ కౌన్సిల్స్ నుంచి కూడా ప్రశంసలు లభించాయి. చంద్రబాబు చూపిన సంస్కరణల దారి - రాష్ట్రానికి కొత్త ఊపునిచ్చాయి. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుపై ఈ అవార్డు ప్రభావం ఖచ్చితంగా ఉంటుంది. అంతేకాదు ఆంధ్రప్రదేశ్‌కు కొన్ని కీలక మార్పులను తెస్తుందనడంలో సందేహం లేదు. భారీగా పెట్టుబడులు రావడమే కాక ఆంధ్రప్రదేశ్‌పై ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పారిశ్రామిక వేత్తలకు ఒక నమ్మకం, భరోసా లభించిందనే చెప్పాలి. అవార్డు ఫలితంగా వారంతా ఆంధ్రప్రదేశ్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టడానికి అవకాశం కలిగింది. అంతేకాకుండా యువతకు ఉద్యోగావకాశాలు భారీగా పెరుగుతాయి. రాజకీయంగా కూడా రాష్ట్రం బలపడుతుంది. దేశంలో సంస్కరణల ప్రయాణాన్ని స్పష్టత, ధైర్యం, స్థిరత్వంతో ముందుకు తీసుకెళ్లిన అరుదైన నాయకుల్లో చంద్రబాబు ఒకరని అవార్డుజ్యూరీ ప్రశంసించడం అది ఆంధ్రప్రదేశ్ ప్రజలకు దక్కిన అరుదైన గౌరవం. పాలనలో 'సంస్కరణలు, వేగం, విశ్వాసం' అనే మూడు సూత్రాలపై పాలనను అందించే చంద్రబాబుపట్ల ఆంధ్రా ప్రజలు నిలిపిన విశ్వాసానికి ప్రతీకే ఈ అవార్డు. చంద్రబాబుకు వచ్చిన ఈ అవార్డు ఒక వ్యక్తి వ్యక్తిగత విజయమే కాదు. ఇది ఒక రాష్ట్రం చూపిస్తున్న పునరుద్ధరణకు గ్లోబల్‌కు తార్కాణం. ఒక రాష్ట్రం సరైన నాయకత్వంలో ఉంటే, సరైన దిశ ఉంటే, సరైన అమలు ఉంటేఆ రాష్ట్రం అభివృద్ధి మళ్లీ పరుగుపెట్టగలదని ఈ అవార్డు నిరూపిస్తోంది. ఈ అవార్డు ద్వారా ప్రపంచం మరోసారి ఒక స్పష్టమైన సందేశాన్ని అందుకుందనేది సత్యం. చంద్రబాబు నాయుడులాంటి అనుభవశాలి ఈ ప్రపంచానికి అవసరమనేది మరోసారి స్పష్టమైంది. అవార్డు గ్రహిత చంద్రబాబు సారధ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రపంచ పటంలో నంబర్ వన్ స్థానంలో నిలవాలని ఆశిద్దాం.

## ఏ ఫైవ్ హోటల్ ప్రాంగణంలో క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయం

**గూడూరు, (రాజధాని వార్తలు):** క్రీడల నిర్వహణకు ఎ-ఫైవ్ హోటల్ ఎంతో అనువుగా ఉందని, జాతీయ స్దాయిలో టెన్నీస్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ కొనియాడారు. చిల్లకూరు మండలం బూదనం సమీపంలో ఏర్పాటై ఉన్న ఎ-ఫైవ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన టెన్నీస్ కోర్టును ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ప్రారంబించారు. ఆలిండియా టెన్నీస్ అసోసియేషన్ అద్వర్యంలో సోమవారం నుండి జాతీయ స్దాయిలో మహిళా క్రీడాకారిణిలకు టెన్నీస్ పోటీలు మొదలయ్యాయి. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ ఆహ్లాద వాతావరణం కలిగిన ఎ-ఫైవ్ హోటల్ జాతీయ స్దాయిలో క్రీడా పోటీలు నిర్వహించేందుకు ఎంతో అనువుగా ఉందని, హోటల్ అధినేత బద్రి గిరిని అభినందిస్తున్నామని తెలిపారు. క్రీడల్లో క్రీడాకారిణిలు రాణించాలని, గెలుపోటములు సహజమని తెలిపారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan